Title Code:T/TG/2024/0625/0392/884

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మనసేత్రం

Follow

పేజీలు 10

శుక్రవారం, ఆగస్టు 1, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## ట్రంప్ ప్రకటించిన అదనపు టారిఫ్ భారంపై చర్యలు తీసుకుంటాం

::: పార్లమెంట్‌లో వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్ భరోసా

న్యూఢిల్లీ: అరడజను సార్లు అమెరికా, భారత ప్రతినిధులు భేటీ అయినా చర్చలు ఓ కొలిక్కిరాకపోవడంతో విసుగుచెందిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్షంగా, ఇష్టారీతిక విధించిన 25 శాతం దిగుమతి సుంకంపై భారతసర్కార్ పార్లమెంట్ సాక్షిగా స్పందించింది. భారతదేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తామని లోక్‌సభ, రాజ్యసభలో వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. నేటి నుంచి 25 శాతం టారిఫ్‌లతోపాటు పెనాల్టీలను భారత్‌పై మోపుతానని ట్రంప్ బుధవారం ప్రకటించిన నేపథ్యంలో గురువారం లోక్‌సభ, రాజ్యసభల్లో గోయల్ కీలక ప్రకటక చేశారు. " హఠాత్తుగా ఏకపక్షంగా ట్రంప్ మనపై అదనపు టారిఫ్‌లను మోపారు. దీని దుష్ప్రభావాలపై విస్తృతస్తాయి అధ్యయనం చేస్తున్నాం.

## రామచంద్రరావు

# తన మార్క్ చూపిస్తారా?



హైదరాబాద్, జూలై 31, (వాయిస్ టుడే)

తెలంగాణ బీజేపీలో సంప్రదాయంగా కొనసాగుతున్న పాత నేతల పెత్తనం పోగొట్టి ప్రక్షాళన చేయడం సాధ్యమేనా..? ఇప్పటికైనా పార్టీలో చేరుతున్న ముఖ్య నేతలతో కొత్త కమిటీలు వేస్తారా..? లేక ప్రస్తుతమున్న కమిటీలనే కొనసాగిస్తారా..? కనీసం కమిటీల్లోనైనా కొత్త నేతలకు అవకాశం ఇస్తారా..? లేక కొత్త నేతలు పనికి రారని పాత వారితోనే బండి నడిపిస్తారా? అసలు టీ బీజేపీలో నూతన అధ్యక్షుడు రామచంద్రరావు మార్క్ ఎలా ఉండబోతుంది..? తెలంగాణ బీజేపీ ప్రక్షాళన దిశగా అడుగులు. తెలంగాణ బీజేపీలో ప్రక్షాళన దిశగా అడుగులు పడుతున్నాయంటున్నారు. ప్రస్తుతమున్న కార్యవర్గంలో కీలక మార్పులు చోటు చేసుకోబోతున్నాయన్న టాక్ వినిపిస్తోంది. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా రామచంద్రరావు పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో అతి త్వరలో నూతన కార్యవర్గం ఏర్పాటు కాబోతుందన్న ప్రచారం ఊపందుకుంటోంది. అందుకు రాష్ట్ర బీజేపీ పెద్దలు పెద్దఎత్తున కసరత్తు చేస్తున్నారంట. ఆ క్రమంలో కొత్త కార్యవర్గం కూర్పు ఎలా ఉండబోతుందా అన ఆ పార్టీ శ్రేణులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. స్టేట్ చీఫ్‌ని ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు. కొత్త కమిటీల ఏర్పాటు అంశం తెరపైకి రావడంతో ఆశావహులు స్టేట్ చీఫ్ ను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. జిల్లా, రాష్ట్ర కమిటీలో స్థానం కోసం ఆశావహులు క్రమంగా పెరుగుతుండటంతో తమకు అవకాశం వస్తుందో..? లేదోననే ఉత్కంఠ నేతల్లో మొదలైంది. కనీసం కమిటీల్లో అయినా కొత్త నేతలకు అవకాశం కల్పిస్తారా..? లేక మొండిచేయి చూపుతారా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆ పార్టీకి విధేయుడిగా ఉన్న రామచంద్రరావుకు అధిష్టాన పెద్దలు పట్టం కట్టారు. మరి నూతనంగా ఏర్పాటు కాబోతున్న కమిటీల్లో ఎవరికి అవకాశం కల్పిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.. కమిటీల్లో తమ మార్క్ చూపించుకున్న కిషన్, సంజయ్. అధ్యక్షుడిగా బండి సంజయ్ తప్పించిన అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి పార్టీ పగ్గాలు అప్పగించారు. కిషన్ రెడ్డి వచ్చాక కమిటీలో పలు మార్పులు జరిగాయి. బండి సంజయ్ ముద్రపడిన పలువురిని తప్పించి కిషన్ రెడ్డి తన టీమ్‌ను ఏర్పాటు చేసుకున్నారనే ప్రచారం జోరుగా జరిగింది. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు కమిటీల్లో తమ మార్క్ చూపించారని గతంలో చెప్పుకున్నారు. మరి ఈ కొత్త కార్యవర్గం అంశంలో రామచంద్రరావు తన మార్క్ చూపిస్తారా? లేదా..? అనేది సస్పెన్స్ గా మారింది. అయితే స్టేట్ చీఫ్‌గా పార్టీలోని పాత నేతకు అవకాశం ఇవ్వడంతో ఇప్పటికే రచ్చ పీక్ స్టేజీకి చేరుకుంది. కొత్త వారికి అవకాశం కల్పించాలంటున్న నేతలు. కనీసం కమిటీలోనైనా కొత్త వారికి అవకాశం కల్పించాలని వలస నాయకులు ఆశిస్తున్నారు. పార్టీ బలోపేతం అవ్వాలన్నా, పార్టీలో చేరికలు పెరగాలన్నా కొత్త వారికి అవకాశం ఇవ్వాలని పలువురు చెబుతున్నారు. అంతేకాదు కొత్త నేతలను బుజ్జగించేందుకయినా కమిటీల్లో చోటు కల్పిస్తారని

(మిగతా 2వ పేజీలో)



## మూడు నెలల్లో

# స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి

### పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై పిటిషన్ సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ : తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్పై సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. దీనిపై స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సీజే బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. తెలంగాణలో 10 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ తరపున గెలిచి.. కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్ని బీఆర్ఎస్ కోరింది. తరువాత, ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై ఈ ఏడాది జనవరిలో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు అయిన విషయం తెలిసిందే. సదరు పిటిషన్లపై విచారణ జరిపి ఏప్రిల్ 3న తీర్పును రిజర్వు చేసింది సర్వోన్నత న్యాయస్థానం. తాజాగా గురువారం నాడు తీర్పు ఇచ్చింది. ధర్మాసనంలో సీజేఐతోపాటు జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ వున్నారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాము దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద, జి జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి,

(మిగతా 2వ పేజీలో)

## వస్తానంటున్న...

# రాజాసింగ్



హైదరాబాద్, జూలై 31, (వాయిస్ టుడే)

ఇటీవల బీజేపీకి రాజీనామా చేసి వార్తల్లో నిలిచిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వరుసగా స్వామీజీలను దర్శించుకుంటున్నారు. ఈ రోజు శంఖేశ్వర్ భవన్‌లో కొలువైన పూజ్య ఆచార్య శ్రీ సూరీశ్వర్జీ మహారాజ్ ను దర్శించుకున్నారు. అనంతరం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో రాష్ట్ర-సంత్ శ్రీ లలితప్రభ జీ, శ్రీ చంద్రప్రభ జీని సైతం దర్శించకుని ఆశీర్వాదం తీసుకున్నారు. వీరి ఆశీర్వాదంతో సమాజం, దేశ సేవ చేయాలనే తన సంకల్పానికి మరింత శక్తి లభిస్తుందన్నారు. ఈ వివరాలను రాజాసింగ్ తన ట్విట్టర్ ఖాతాలో షేర్ చేశారు. అయితే.. రాజాసింగ్ వరుసగా స్వామీజీలను కలిసి ఆశీర్వాదాలు తీసుకుంటుండడం హాట్ టాపిక్ గా మారింది. బీజేపీకి రాజీనామా చేసిన తర్వాత ఆయన ఏ పార్టీలోనూ ఇంత వరకు చేరలేదు. భవిష్యత్ కార్యాచరణపై ఆయన త్వరలోనే నిర్ణయం ప్రకటిస్తారని.. ఈ నేపథ్యంలోనే స్వామీజీలను కలిసి ఆశీర్వాదాలు తీసుకుంటున్నారన్న చర్చ సాగుతోంది. 2014, 18, 23 ఎన్నికల్లో బీజేపీ నుంచి గోషామహల్ నియోజకవర్గం ఎన్నికల బరిలో దిగిన రాజాసింగ్ హ్యాట్రిక్ విజయాలు అందుకున్నారు. 2018-23 మధ్య ఆయన ఓ సారి పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. ఓ వర్గంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారన్న విమర్శల నేపథ్యంలో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే.. గత అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకున్నారు. సస్పెన్షన్ ఎత్తివేసి మళ్లీ గోషామహల్ నుంచి పార్టీ అభ్యర్థిగా బరిలోకి దించింది బీజేపీ. ఆ ఎన్నికల్లోనూ ఆయన విజయం సాధించారు. బీజేపీ నుంచి 2023లో తెలంగాణలో గెలిచిన ఎమ్మెల్యేలందరిలో

(మిగతా 2వ పేజీలో)




## బీసి రిజర్వేషన్లు...

# ఓవర్ టూ ఢిల్లీ

హైదరాబాద్, జూలై 31, (వాయిస్ టుడే)

రేపటి స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభావితం చేసే బీసీ రిజర్వేషన్ పైనే అందరి దృష్టి కేంద్రీకరించబడి ఉంది. ఈ విషయంలో ఏ పార్టీ ఏవిధంగా స్పందిస్తున్నారు అనే విషయాలపై బీసీ వర్గాలు సునిశితంగా పరిశీలిస్తున్నారు. అయితే ప్రస్తుతం బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఏవిధంగా స్పందించాలని విషయంలో కొన్ని రాజకీయ పక్షాలు ఇంకా మల్లగుల్లపడుతున్నాయి. తెలంగాణ అసెంబ్లీ లో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించిన కాంగ్రెస్ ప్రభుత్వం, రాష్ట్రపతి ఆమోదానికి పంపింది. అయితే ఈ విషయంలో బిల్లుకు కేంద్ర ప్రభుత్వంలో ఉన్న బీజేపీ అనుకూలంగా లేనట్లు కనిపిస్తున్న తరుణంలో రాష్ట్రపతి ఆమోదముద్ర కు సమయం పడే అవకాశముంది. దీంతో ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేసి గవర్నర్ కు పంపి తమ చిత్తశుద్ధి చాటుకున్నారు. అయితే బీసీ రిజర్వేషన్ల కు వ్యతిరేకం కాదని ఒకవైపు ప్రకటిస్తూనే, మరోవైపు ఈబీసీ రిజర్వేషన్ల బిల్లులో ముస్లింలకు రిజర్వేషన్ కల్పించినందుకు బీజేపీ అడ్డుతుగులున్నట్లు స్పష్టమౌతుంది. అయితే ఈ బిల్లు విషయంలో బిఆర్ఎస్ పార్టీ మాత్రం ఇంకా డైలమాలో ఉన్నట్లు కనిపిస్తోంది. ఎలాగైనా బీజేపీ ఈ బిల్లు సమర్థించదని తెలిసి కూడా కాంగ్రెస్ బిల్లు ప్రవేశపెట్టిందని, ఆ పార్టీకి రిజర్వేషన్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్ అధినాయకులు విమర్శలకు పరిమితమయ్యారు.అయితే కేసీఆర్ కూతురు కవితక్క మాత్రం ఈ బిల్లును స్వాగతిస్తూ, సంబరాలు చేసుకోవడంతో తన రాజకీయ పరిణతిని ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తన విధిని తాను నిర్వర్తించిందని, బిల్లు ను సమర్థిస్తూ ప్రకటన చేయడంలో తప్పేమీ లేదని ఆమె తన వైఖరి స్పష్టం చేశారు. ఏదీ ఏమైనా బీసీ లకు మద్దతుగా బిల్లు ఆమోదిస్తే దాన్ని వ్యతిరేకించడం వారి నుంచి పార్టీ దూరం కావడమేనని ఆమె భావించినట్లున్నారు. అందుకే ఎలాంటి భేషజాలు లేకుండా సమర్థించారు. ఎలాగోలా ఈ అవకాశం వచ్చినా అందిపుచ్చుకోవడం తెలుసుకున్న కవిత, ఈ విషయంలో పార్టీ తీసుకున్న స్టాండ్ కు వ్యతిరేకంగా స్పష్టమైన ప్రకటన చేస్తూ కేటీఆర్ కన్నా తనకు రాజకీయాలపై ఎక్కువ అవగాహన ఉందని మరోసారి చాటి చెప్పారు. కానీ ఈ విషయంలో బిఆర్ఎస్ మాత్రం ఏవిధంగా స్పందించాలని మీమాంసలో

(మిగతా 2వ పేజీలో)

# ముద్రా పేరుతో మాయ..




కరీంనగర్, జూలై 31, (వాయిస్ టుడే)

ముద్ర అగ్రికల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ మల్టీస్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ తిప్పనేని రామదాసప్పను తెలంగాణ సీఐడీ అధికారులు అమరావతిలో అరెస్టు చేశారు. రైతులు, నిరుద్యోగులు,రోజువారీ కూలీలను లక్ష్యంగా చేసుకుని ఉద్యోగాలు, అధిక వడ్డీల పేరుతో 2 మంది బాధితుల నుంచి రూ.140 కోట్లు వసూలు చేసిన కేసులో రామదాసప్పతో పాటు ఆయన కుమారుడు తిప్పేనేని సాయి కిరణ్‌ను హైదరాబాద్ లో అదుపులోకి తీసుకున్నారు.సీఐడీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 2 వేల మార్కెటింగ్ మేనేజర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నిందితులు పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. ఆ ప్రకటనలు చూసిన పలువురు నిరుద్యోగులు రెండు రాష్ట్రాలకు చెందిన పలువురు బాధితులు వారిని సంప్రదించారు. వారి బలహీనతను అసరా చేసుకున్న నిందితలు వారి వద్ద పెద్ద మొత్తాల్లో నగదు వసూలు చేశారు. అనంతరం వారికి ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పి రైతుల నుంచి పెట్టుబడులకు ఉసికొల్పారు. వారినుంచి పెట్టుబడులు తేకుంటే మీ జీతం నుంచి తీసుకుంటానని, సర్టిపికెట్లు ఇవ్వనని వేధించాడు. ఈ విషయమై తెలంగాణ, ఏపీలలో పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగాఈ విషయమై తీగలాగితే పెద్ద డొంక కదిలింది. ఉద్యోగాలు, అధిక వడ్డీల పేరుతో కోట్లు కొల్లగొట్టినట్లు తేలడంతో కేసును సీఐడీకి అప్పగించారు. విచారణ జరిపిన సీఐడీ ఇద్దరినీ అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించింది.కేంద్రప్రభుత్వ ప్రధాన మంత్రి ముద్ర యోజన పేరుతో రామదాసప్ప నాయుడు సహకార సంఘాన్ని స్థాపించాడు. ఇది ప్రభుత్వ సంస్థ అని నమ్మించాడు. ఈ సంఘంలో పెట్టుబడి పెడితే డిపాజిట్లపై అధిక వడ్డీని ఇస్తానని, సభ్యులుగా చేరిన వారికి శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను ఇస్తానని హామీ ఇచ్చాడు. సొసైటీని త్వరలో ప్రభుత్వ గుర్తింపు పొందిన బ్యాంకుగా మారుస్తామని కూడా అతను చెప్పాడు. ఈ హామీలు, ముఖ్యంగా వార్తపత్రికల్లో ఇచ్చిన ప్రకటనల్లో 2,000 'ప్రభుత్వ మార్కెటింగ్ సూపర్‌వైజర్' ఉద్యోగాలను ఇస్తామని మభ్య పెట్టాడు. దీనికోసం1,600 మంది ఉద్యోగులను నియమించుకున్నాడు. ఆ సమయంలో వారి ఒరిజనల్ సర్టిఫికెట్లను కూడా తీసుకున్నారు.బాధితులను వాటా మూలధనం , పెట్టుబడి బాండ్లను కొనుగోలు చేసే నెపంతో డబ్బు డిపాజిట్ చేయమని కోరారు.ఇక రైతులు, చిన్నవ్యాపారుల నుంచి డిపాజిట్లు సేకరించాలని మార్కెటింగ్ సూపర్‌వైజర్లుగా నియమించబడిన ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేశారు. డిపాజిట్ లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైన ఫలితంగా ఉద్యోగుల జీతాల నుండి కోతలు విధించారు. అయితే ఉద్యోగం నచ్చక రాజీనామా చేసిన వారికి వారి సర్టిఫికెట్లు, రిటర్న్‌లను ఇవ్వడానికి నిరాకరించారు. కాగా ప్రజల నుండి వసూలు చేసిన పెద్ద మొత్తాలను ఆంధ్రప్రదేశ్‌లోని లిమిటెడ్ ద్వారా పారిశ్రామిక ప్లాట్లను కొనుగోలు చేయడానికి మళ్లించారని దర్యాప్తులో తేలింది. మోసపూరిత సొసైటీ సుమారు 330 శాఖలను తెరిచి 2,000 మందికి పైగా బాధితులను మోసం చేసిందని భావిస్తున్నారు.కాగా బాధితుల ఫిర్యాదుతో తెలంగాణ అంతటా

(మిగతా 2వ పేజీలో)

# బీసి రిజర్వేషన్లు... ఓవర్ టూ ఢిల్లీ

కొట్టుమిట్టాడుతునే ఉన్నారు.అయితే స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న ఈ తరుణంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుచూపుగా మరో అడుగు ముందుకు వేసేందుకు సిద్ధమైంది. బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొందేందుకు కొంత సమయం పట్టినా, ఆర్డినెన్స్ కు గవర్నర్ ఆమోదముద్ర వేసేందుకు తాత్సారం చేసినా తమ పార్టీ మాత్రం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం కు అనుగుణంగా బీసీ అభ్యర్ధులకు టిక్కెట్లు ఇచ్చి రంగంలోకి దింపుతామని ఇదివరకే ప్రకటించడం బిఆర్ఎస్ నేతలకు మింగుడుపడడం లేదు. కనీసం బిల్లు విషయం పక్కనబెట్టి తమ పార్టీ కూడా 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇస్తామని ప్రకటించేందుకు సైతం అధైర్యం చేయడం లేదు. ఈ విషయంలో పార్టీ జిల్లా, మండల స్థాయి బీసీ నాయకులు పార్టీ నేతలపై ఒత్తిడి తెస్తున్నా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వాన్ని కోల్పోయి, ఎంపీ స్థానాల్లో ఒక్కటి కూడా గెలుచుకోలేక, ఎంఎల్సీకి పోటీ కూడా చేయలేని పరిస్థితుల్లో ఉన్న బిఆర్ఎస్ పార్టీ మరోవైపు ట్యాపింగ్, కార్ రేస్, కాళేశ్వరం తో పాటు మరెన్నో కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్న ఈ సమయంలో కనీసం కిందిస్తాయి కేడర్ ను నిలుపుకునేందుకు అవకాశమున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో త అభ్యర్ధులను గెలిపించుకునే ప్రయత్నాల్లో భాగంగా కార్యక్రమాలు రూపకల్పన చేసుకుంటున్నారు. కానీ ప్రధానమైన బీసీ నినాదం స్తానిక ఎన్నికలను ప్రభావితం చేస్తుందని, ఈ విషయంలో తాము పార్టీ పరంగా 42 శాతం లేక ఇంకా ఎక్కువగా రిజర్వేషన్ బీసీలకు ఇస్తామని ప్రకించే విషయంలో ఆ పార్టీ నేతలు సంశయిస్తున్నారు. బీసీ లను మోసం చేసేందుకు కాంగ్రెస్ బీసీ బిల్లు, ఆర్డినెన్స్ చేస్తున్నారని విమర్శలకే పరిమితమవుతున్నారు.నామినేటెడ్ పదవుల్లో కూడా పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించే బీసీ నాయకులకు పెద్దపీట వేసేందుకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కొన్ని నియోజకవర్గాల్లో ఓసీ స్థానాలకు కేటాయించిన నామినేటెడ్ పదవులను బీసీ లకుకేటాయించే విషయంలో ముందుచూపు ప్రదర్శించింది. రాష్ట్రంలో నిర్ణయాత్మకమైన ఓటు కలిగి ఉన్న బీసీ లకు ప్రాధాన్యత ఇచ్చే విషయంలో కాంగ్రెస్ వడివడిగా అడుగులు వేస్తున్న ఈ సమయంలో ఇంటిపోరుతో ఇబ్బందులు పడుతున్న బిఆర్ఎస్ భవితవ్యంపై ఆ పార్టీలోని నాయకులే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎవ్వరూ తగ్గేదేలే అన్నట్లున్నారు..! బిల్లు ఆమోదం కోసం ఎందాకైనా వెళ్తామంటోంది తెలంగాణ ప్రభుత్వం. రాష్ట్రపతిని కలిసి విజ్ఞప్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఆగస్ట్ 5 నుంచి 7 వరకు ఢిల్లీ వేదికగా రేవంత్ బృందం కార్యాచరణ అమలు చేయనుంది. సామ–దాన–భేద దండోపాయం ద్వారా బీసీ రిజర్వేషన్లను సాధిస్తామంటున్నారు ప్రభుత్వ పెద్దలు.మీరేంటి బీసీల కోసం పోరాడేది.. అసలు పోరాటమంటే ఏంటో చూపిస్తామంటోంది బీఆర్ఎస్. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్రపతిని కలుస్తామంటున్నారు కారుపార్టీ నేతలు. ఢిల్లీ రావాలని కేసీఆర్‌ను నేతలు కోరగా.. సరే వెళ్లి కలుద్దామని చెప్పినట్లు తెలుస్తోంది. ఆతర్వాత కూడా ఫలితం లేకపోతే.. మున్ముందు ఇంకాస్త దూకుడుగా ముందుకెళ్తామంటున్నారు నేతలు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలాడుతోందని.. దమ్ముంటే కార్పొరేషన్ చైర్మన్లు బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.ఇటు బీజేపీ నేతలు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వంపై కన్నెర్ర చేస్తున్నారు. అది %దీజ% బిల్లు కాదు.. ముస్లిం రిజర్వేషన్ బిల్లు అంటున్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముస్లింలకు కేటాయించిన 10శాతం రిజర్వేషన్లను తొలగిస్తేనే బిల్లుకు మద్దతిస్తామంటున్నారు.ఎమ్మెల్సీ కవిత సైతం బీసీ బిల్లు సాధన కోసం పోరుకు సిద్ధమయ్యారు. ఆగస్టు 4, 5, 6 తేదీల్లో 72 గంటల దీక్ష చేయనున్నట్లు ప్రకటించారు. గవర్నర్ దగ్గర పెండింగ్‌లో ఉన్న అర్డినెన్స్ అంశంపై ప్రభుత్వం సుప్రీంకోర్టు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. బీసీ బిల్లు సాధన విషయంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. అఖిలపక్షం ఏర్పాటు చేసి ఢిల్లీకి తీసుకెళ్లాలన్నారు కవిత.మొత్తంగా%ౌ% ఓవర్ టు ఢిల్లీ అంటున్నాయి తెలంగాణలోని పొలిటికల్ పార్టీలు. మరి పార్టీల ఒత్తిడితో కేంద్రం దిగొస్తుందా..? బిల్లుకు ఆమోదం తెలుపుతుందా..? అన్నది చూడాలి.

# రాష్ట్ర ప్రభుత్వానికి అందిన 'కాళేశ్వరం' నివేదిక

### ఇరిగేషన్ ముఖ్య కార్యదర్శికి సమర్పించిన జస్టిస్ ఘోష్ కమిషన్

### బరాజ్‌ల వైఫల్యానికి అంశాల వారీగా బాధ్యుల గుర్తింపు..!

### నేడు సీఎం ముందుకు నివేదిక



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై సుదీర్ఘ విచారణ నిర్వహించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. జస్టిస్ పినాకి చంద్రఘోష్ గురువారం తన కార్యాలయంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు సీల్డ్ కవర్‌లో నివేదికను అందజేశారు. మూడు సంపుటాల్లో నివేదికను సిద్ధం చేశారు. 650కిపైగా పేజీలతో ప్రధాన నివేదిక అందజేసినట్లు జస్టిస్ ఘోష్ పేర్కొనగా.. అనుబంధాలతో కలిపి మొత్తం మూడు సంపుటాలుగా ఇచ్చిన నివేదికలో వెయ్యికిపైగా పేజీలున్నట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ 2023 అక్టోబర్ 21న కుంగిపోగా, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సైతం బుంగలు ఏర్పడి నీళ్లు సీపేజీ అయ్యాయి. ఆ వెంటనే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బరాజ్‌ల నిర్మాణంలో సాంకేతిక లోపాలతోపాటు అవినీతి ఆరోపణలపై విచారణ కోసం 2024 మార్చి 14న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్‌తో విచారణ కమిషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

**బాధ్యులు వారేనా?**

బరాజ్‌ల డిజైన్లు, నిర్మాణంతోపాటు నిర్వహణ, పర్యవేక్షణలో పాల్గొన్న నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, మాజీ ఈఎన్సీలు, సీఈలు, ఎస్ఈలు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు, ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లను కమిషన్ ప్రశ్నించి కీలక సాక్ష్యాధారాలను సేకరించింది. బరాజ్‌ల స్థల ఎంపికతోపాటు ఇతర కీలక నిర్ణయాలను నాటి సీఎం కేసీఆర్ తీసుకున్నారని పలువురు మాజీ ఇంజనీర్లు, ఐఏఎస్‌లు విచారణ కమిషన్ ముందు సాక్ష్యం ఇచ్చారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన వేలాది ఫైళ్లను జల్లెడ పట్టిన కమిషన్.. ఎన్నో అవకతవకతలను గుర్తించింది. క్రాస్ ఎగ్జామినేషన్‌లో పాల్గొనే సాక్షులకు వాటి ఆధారంగా ప్రశ్నలను సంధించింది. విచారణ చివర్లో మాజీ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, మాజీ నీటిపారుదల మంత్రి హరీశ్‌రావు, మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించింది. మంత్రివర్గ నిర్ణయాల ఆధారంగానే బరాజ్‌ల నిర్మాణ పనులు జరిగాయని మాజీ మంత్రులిద్దరితోపాటు కేసీఆర్ కమిషన్ ఎదుట వాగ్మూలం ఇచ్చారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఈ వాదనలను ఖండిస్తూ అసలు గత ప్రభుత్వంలోని జరిగిన మంత్రివర్గ సమావేశాల్లో బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించి ఎలాంటి నిర్ణయాలు జరగలేదని తేల్చింది. దీనికి సమర్థనగా గత ప్రభుత్వంలో జరిగిన కేబినెట్ సమావేశాలకు సంబంధించిన తీర్మానాల ప్రతులతో కమిషన్‌కు నివేదిక అందించింది. బరాజ్‌లకు సంబంధించిన నిర్ణయాలను ఎవరు తీసుకున్నారనే అంశాన్ని నిర్ధారించడానికి ఈ నివేదిక కీలకం కానుంది. ప్రధానంగా తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బరాజ్ స్థల మార్పుపై నిర్ణయం ఎవరు తీసుకున్నారనే అంశంపై కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ సందర్భంగా పలువురు సాక్షులను ప్రశ్నించింది. చాలా మంది సాక్షులు దీనికి సమాధానంగా ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌ల పేర్లను ఉటంకించారు. విచారణకు హాజరైన సాక్షుల్లోనే పలువురి పాత్రపై ఆధారాలను సేకరించిన కమిషన్.. వారినే బాధ్యులుగా నిర్ధారిస్తూ నివేదికలో పొందపరిచినట్లు సమాచారం.

**నేడు సీఎంకు నివేదిక..**

జస్టిస్ ఘోష్ గురువారం సమర్పించిన నివేదిక నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి చేరగా.. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆ నివేదికను అందచేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ 'సాక్షి'కి తెలిపారు. అనంతరం నివేదికను మీడియాకు బహిర్గతం చేయనున్నట్లు తెలిపారు.

**అంశాలకు కట్టుబడే నివేదిక.. జస్టిస్ ఘోష్**

ప్రభుత్వం కమిషన్‌కు నిర్దేశించిన అంశాలకే పరిమితమై నివేదికను సిద్ధం చేసినట్లు జస్టిస్ పీసీ ఘోష్ తెలిపారు. ఈ నేపథ్యంలో బాధ్యులపై తీసుకోవాల్సిన చర్యలపై ఎలాంటి సిఫారసులు చేయలేదని మీడియాకు తెలియజేశారు. సర్కారుకు నివేదిక అందించడంతో తన బాధ్యత తీరిందన్నారు. ఇకపై కమిషన్ కార్యకలాపాల కోసం హైదరాబాద్‌కు రానన్నారు. సర్కారు నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటుందా అని ప్రశ్నించగా అది తనకు తెలియదన్నారు.

**బాధ్యులెవరు? ప్రజాధన దుర్వినియోగం ఎంత?**

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణంలో నిర్లక్ష్యం, అక్రమాలు, లోపాలు, కాంట్రాక్టర్లకు పనుల అప్పగించిన తీరు, చేసుకున్న ఒప్పందాలు, వాటి అమలు తీరు/ఉల్లంఘనలతోపాటు వాటి అమల్లో ఆర్థిక క్రమశిక్షణ కఠినంగా పాటించారా లేదా? వంటి అంశాలపై విచారణ కోసం ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసింది. క్వాలిటీ కంట్రోల్, పర్యవేక్షణ అంశాలు, నిర్మాణ సంస్థలు/కాంట్రాక్టర్లు, నీటిపారుదల శాఖల నిర్లక్ష్యం, ఇతర అవకతవకతలపై విచారణ జరపాలని కోరింది. అసమంజస రీతిలో ఒప్పందాల గడువు పొడిగింపు, పనులు పూర్తయినట్లు తప్పుడు సర్టిఫికేట్ల జారీ, గడువు పూర్తికాక ముందే బ్యాంక్ గ్యారెంటీల విడుదల, తదితర చర్యలతో నిర్మాణ సంస్థలు/కాంట్రాక్టర్లకు అనుచిత లబ్ధి కలిగించిన వ్యవహారంపై విచారణ జరిపి సంబంధిత అధికారులు/సంస్థలను బాధ్యులుగా నిర్ధారించాలని సూచించింది. అంశాలవారీగా బాధ్యులను గుర్తించడంతోపాటు దుర్వినియోగమైన నిధులను కమిషన్ నిర్ధారించి నివేదికలో పొందుపరిచినట్లు తెలిసింది.

# కమిషన్ వేయాలా? వద్దా? తేలుస్తాం

### 'భూదాన్' కేసులో

### తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు



హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా నాగారంలోని 181, 182, 194, 195 సర్వే నంబర్లలోని భూదాన్ భూముల అన్యాక్రాంతం, అక్రమాల ఆరోపణలపై విచారణ కమిషన్ వేయాలా? వద్దా? అనేది తేలుస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు దాఖలైన పిటిషన్‌లో తీర్పు రిజర్వు చేసింది. ఈ సర్వే నంబర్లలో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు భూములను అక్రమంగా తమ పేరిట నమోదు చేసుకున్నారని, వీటిపై కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరపాలని దాఖలైన మరో పిటిషన్‌లోని మధ్యంతర అప్లికేషన్ల(ఐఏ)లో తీర్పు వాయిదా వేసింది. భూకబ్జాలపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని, దీనిపై విచారణ కమిషన్ వేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ అంబర్‌పేట్‌కు చెందిన బిర్లా మహేశ్, పడమటి తండాకు చెందిన రాములు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం మళ్లీ విచారణ చేపట్టారు.

**తెలియకుండా భూములు మార్చేశారు..**

పిటిషనర్ తరఫున డాక్టర్ జె.విజయలక్ష్మి వాదనలు వినిపిస్తూ.. '194/ఐ, 195/ఐలో రాములు భూములున్నాయి. ప్రస్తుతం ఆ భూములు అతని అధీనంలోనే ఉన్నాయి. పాస్‌బుక్ అతని పేరిటే ఉన్నా.. భూభారతిలో మాత్రం జావేద్, ఆర్షియా సుల్తానా, అబ్దుల్ లతీఫ్ పేర్లు చూపిస్తోంది. తనకు తెలియకుండా ఆన్‌లైన్‌లో ఎలా మార్చారో చెప్పాలని తహసీల్దార్‌ను కోరినా వివరాలు ఇవ్వలేదు. కోర్టు ఆదేశించినా స్పందనలేదు. కమిషన్ వేస్తే గానీ వివరాలు బహిర్గతం కావని కోర్టును ఆశ్రయించాం'అని తెలిపారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. 'కమిషన్ వేస్తారు.. నివేదిక వస్తుంది, అది కూడా ఉన్నతాధికారులకు సమర్పించాల్సిందే, అప్పుడు కూడా ఆ నివేదికను అల్మారాలో పెట్టి వదిలేస్తే ఏం చేస్తారు'అని ప్రశ్నించారు. మళ్లీ కోర్టును ఆశ్రయించాల్సిందేనని న్యాయవాది బదులిచ్చారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. వ్యక్తిగత అంశాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించడం సాధ్యం కాదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఈ పిటిషన్‌లో తీర్పు రిజర్వు చేశారు.




## బాధ్యతలు చేపట్టిన కొత్త జడ్జీలు

### నలుగురితో ప్రమాణం చేయించిన హైకోర్టు సీజే జస్టిస్ ఏకే సింగ్

### తొలిరోజే విచారణ చేపట్టిన జస్టిస్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ రామకృష్ణా రెడ్డి, జస్టిస్ చలపతిరావు, జస్టిస్ మొహియుద్దీన్

హైదరాబాద్: హైకోర్టులో కొత్తగా నియమితులైన నలుగురు జడ్జీలు అదనపు న్యాయమూర్తులుగా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. గాడి ప్రవీణ్ కుమార్, రామకృష్ణారెడ్డి, సుద్దాల చలపతిరావు, గౌస్ మీరా మొహియుద్దీన్‌తో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణం చేయించారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాల్‌లో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో పాటు కొత్త జడ్జీల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. బాధ్యతలు చేపట్టిన కొత్త జడ్జీలు తొలిరోజు సీనియర్ న్యాయమూర్తులతో కలసి కేసుల విచారణలో పాల్గొన్నారు. వీరి నియామకంతో హైకోర్టులో జడ్జీల సంఖ్య 30కి పెరిగింది. ఇంకా 12 ఖాళీలున్నాయి. ఈ నలుగురిని న్యాయవాదుల కోటాలో జడ్జీలుగా నియమిస్తూ గత నెల 28న కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

## రామచంద్రరావు తన మార్క్ చూపిస్తారా?

పలువురు భావిస్తున్నారు. కానీ అందుకు భిన్నంగా రాష్ట్ర పార్టీ స్పష్టంగా పార్టీ పదవులు పాత వారికేననే ధోరణితో ఉందంట. పాత వారయితేనే పార్టీ మరింత బలోపేతమవుతుందని, చేరికలు సైతం పెరుగుతాయన్న అంచనాల్లో కమలం పార్టీ ఉన్నట్లు సమాచారం. కొత్త వారికి రాజకీయ పదవుల్లో మాత్రం అవకాశం కల్పించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు చేస్తున్న కాషాయనేతలు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి వచ్చేందుకు కాషాయ పార్టీ ఇప్పటినుంచే వ్యూహాలకు పదును పెడుతోంది. అందుకు అనుగుణంగా కమిటీలను సిద్ధం చేయాలని ప్లాన్ చేస్తోంది. అంతేకాదు త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా పార్టీ కసరత్తును ముమ్మరం చేస్తోంది. ఇతర పార్టీల కంటే ఒకడుగు ముందంజలోనే ఉండాలని పట్టుదలతో ఉంది. అందుకు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా కార్యకర్తలకు వర్క్ షాప్, శిక్షణ తరగతులతో దిశానిర్దేశం చేయాలని చూస్తోంది. అందులో భాగంగానే ఇటు కార్యవర్గాల కమిటీ నియామకం, అటు స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో ఆశావహులు నూతన అధ్యక్షుడిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారంట.



## మూడు నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి

చింతా ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్, బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేసారు. ఈ ఏడాది జనవరి 15న పిటిషన్లు దాఖలు కాగా, సుప్రీంకోర్టులో తొమ్మిది సార్లు విచారణకు వచ్చాయి. కేసుపై ధర్మాసనం వ్యాఖ్యానిస్తూ ఏళ్ల తరబడి ఫిరాయింపు పిటిషన్లను పెండింగ్లో ఉంచడం సరికాదని పేర్కొంది. విచారణను పొడిగించడానికి ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తే, స్పీకర్ ప్రతికూల నిర్ణయం తీసుకోవచ్చురు. అలాగే, పార్టీ ఫిరాయింపులపై పార్లమెంట్లో చట్టం చేయాలని అభిప్రాయపడింది. తాము స్వయంగా వేటు వెయ్యలేమన్న సుప్రీంకోర్టు.. దీనిపై మూడు నెలల్లో స్పీకరే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

## వస్తానంటున్న... రాజాసింగ్

రాజాసింగ్ మాత్రమే పార్టీలో సీనియర్. అత్యధిక సార్లు ఎమ్మెల్యేగా గెలిచింది కూడా ఆయనే. ఈ నేపథ్యంలో బీజేపీ శాసనసభా పక్ష నేత పదవి తనకు ఖాయమని రాజాసింగ్ భావించారు. కానీ పార్టీ హైకమాండ్ మాత్రం మహేశ్వరరెడ్డికి అవకాశం ఇచ్చింది. అనంతరం వచ్చిన పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ ఎంపీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగాలని ఆశించారు. కానీ మాధవిలతను అక్కడి నుంచి పోటీకి దించింది బీజేపీ హైకమాండ్. ఈ రెండు విషయాల్లో తీవ్ర మనస్థాపానికి గురైన రాజాసింగ్.. పార్టీ పెద్దలను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పిస్తూ వచ్చారు.ముఖ్యంగా రాష్ట్రంలో అగ్రనేతలు అని చెప్పుకునే వారే పార్టీ ఎదగకపోవడానికి కారణమని ధ్వజమెత్తారు. ఈ క్రమంలో పార్టీ అధ్యక్షుడిగా రామ్ చందర్ రావును నియమించిన రోజే ఆయన రాజీనామా చేశారు. అయితే.. పార్టీ రాష్ట్ర నేతలపై దుమ్మెత్తి పోస్తున్న రాజాసింగ్.. మోదీ, అమిత్ షాలపై మాత్రం పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. దీంతో ఆయన మళ్లీ బీజేపీలోకి ఎంట్రి ఇచ్చే అవకాశం ఉందన్న చర్చ కూడా సాగుతోంది.

## ముద్రా పేరుతో మాయ..

నల్లకుంట, కాచిగూడ, గంభీరావుపేట, రామాయంపేట, దుబ్బాక, వేములవాడ, అచ్చంపేట, ఆత్మకూర్ సహా వివిధ పోలీస్ స్టేషన్లలో నిందితులపై కేసులు నమోదయ్యాయి. ఐపీసీ సెక్షన్లు 406 (నేరపూరిత నమ్మక ద్రోహం), 420 (మోసం), 506 (నేరపూరిత బెదిరింపు), 409 (ప్రభుత్వ ఉద్యోగి లేదా బ్యాంకర్ ద్వారా నేరపూరిత నమ్మక ద్రోహం), మరియు తెలంగాణ ఆర్థిక సంస్థల డిపాజిట్ల రక్షణ చట్టం, 1999 లోని సంబంధిత నిబంధనల కింద నమోదు చేశారు. కాగా. సేకరించిన నిధులను ఎక్కడికి తరలించారు. ఇతర లబ్ధిదారులు ఎవరు? అనే కోణంలో సీఐడీ దర్యాప్తు జరుపుతోంది.

# మోస్ట్ పవర్‌ఫుల్‌గా చందానగర్ పోలీస్, క్రైమ్ టీం..

## నేరం జరిగిన కొద్ది సమయంలోనే కేసులను చేదిస్తున్న క్రైమ్ టీం..

## బాధితులు, స్థానికుల నుండి ప్రశంసలు అందుకుంటున్న చందానగర్ పోలీస్..

### చందానగర్ పోలీసులపై "వాయిస్ టుడే" ప్రత్యేక కథనం..




శేరిలింగంపల్లి, జులై 31(వాయిస్ టుడే): పూర్వం గొలుసు, వాహన, ఇంటి మరియు జేబు దొంగలు వంటి రకరకాల దొంగల నుండి దొంగలించబడిన వస్తువులను తిరిగి స్వాధీనం చేసుకోవడం చాలా కష్టమైన పని. కానీ ఇప్పుడు టెక్నాలజీ పుణ్యమా అని పోలీసులు కేసులను త్వరగానే ముగిస్తున్న సందర్భాలను మనం చూస్తున్నాం. అయితే, ఎంత టెక్నాలజీ ఉన్నా సరైన అనుభవం, ప్రతిభ లేకపోతే అంతా వృధానే. కానీ చందానగర్ పోలీస్ క్రైమ్ టీం మాత్రం నిరంతరం తమను తాము అప్డేట్ చేసుకుంటూ, అసాధారణ రీతిలో కేసులను ఛేదిస్తున్నారు. చందానగర్ పోలీసులు, క్రైమ్ టీం రంగంలోకి దిగిందంటే తమకు కచ్చితంగా న్యాయం జరుగుతుందని బాధితులు, స్థానికులు బలంగా విశ్వసిస్తున్నారు. వారి నుండి పోలీసులు ప్రశంసలు కూడా అందుకుంటున్నారు. వృద్ధాప్యంలో ఉన్న ఫిర్యాదు దారుల వద్దకే నేరుగా పోలీసులు వెళ్లి ఫిర్యాదు స్వీకరించడం ఎంతో అభినందనీయమని స్థానికులు అంటున్నారు. అయితే, నేటి దొంగలు కూడా చాలా అప్డేట్ అయ్యారు. సీసీటీవీ లేని ప్రాంతాల్లో ముందుగా రెక్కీ నిర్వహించి, ముఖం కనిపించకుండా, వాహన నంబర్ ప్లేట్లు, వేలిముద్రలు ఎటు వంటి ఆధారాలు దొరకకుండా చోరీలకు పాల్పడుతూ, కెమెరాలు లేని ప్రదేశాల నుండి పరారవుతున్నారు. ఇలాంటి ఘటనే తాజాగా ఓ కాలనీలో జరిగింది. ఓ వృద్ధురాలు ఉదయం వాకిలి ఊడుస్తుండగా, ద్విచక్రవాహనంపై వచ్చిన దుండగుడు ఆమె మెడలో నుండి గొలుసును లాక్కెళ్ళాడు. వెంటనే కుటుంబ సభ్యులు 100కి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న చందానగర్ క్రైమ్ టీం తక్షణమే స్పందించి, సాంకేతిక ఆధారాల ద్వారా చాకచక్యంగా వ్యవహరించి, రెండు-మూడు గంటల్లోనే నిందితుడిని పట్టుకొని, గొలుసును బాధితురాలికి అందజేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ఇదే క్రమంలో, చందానగర్, హుడా కాలనీ, మియాపూర్ వంటి ప్రాంతాల్లో దేవాలయాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతూ... పోలీసులకు ఎటువంటి ఆధారాలు దొరకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్న కేసును కూడా చందానగర్ పోలీసులు, ముఖ్యంగా క్రైమ్ టీం, అతి తక్కువ సమయంలోనే ఛేదించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కేసును రాత్రింబవళ్ళు శ్రమించి, ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు తీసుకుంటూ, వ్యూహాత్మకంగా వ్యవహరించి, గాజుల రామారామ్‌కు చెందిన ముగ్గురు నిందితులను బుధవారం అరెస్ట్ చేశారు. ఆలయాల్లో దొంగలించబడిన బంగారం, వెండి వస్తువులను దొంగల నుండి స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటిని త్వరలోనే ఆలయ నిర్వాహకులకు అందజేయనున్నారు. ఇలా మరెన్నో కేసులను చందానగర్ క్రైమ్ టీం తమ అనుభవం, నైపుణ్యంతో తక్షణమే స్పందించి పరిష్కరిస్తున్నారు.

ఇవన్నీ ఒక ఎత్తైతే, ఈ మధ్యకాలంలో స్మార్ట్ ఫోన్,బైకు దొంగలు ఎక్కువయ్యారు. స్మార్ట్‌ఫోన్‌లు, ఖరీదైన బైకులు అందుబాటులోకి వచ్చినప్పటి నుండి భారీ సంఖ్యలో కేసులు నమోదు అవుతున్నాయి. అయినప్పటికీ చివరి అవకాశం వరకు ప్రయత్నించి దాదాపు అన్ని బైకులను, ఫోన్‌లను దొంగల నుండి స్వాధీనం చేసుకొని బాధితులకు పోలీసులు అప్పగిస్తున్నారు. తాజాగా జరిగిన సంఘటనలనే పరిగణనలోకి తీసుకొని బాధితులతో నేరుగా మాట్లాడి "వాయిస్ టుడే" ఈ కథనాన్ని ప్రచురించింది.

### హర్షం వ్యక్తం చేసిన వృద్ధ బాధితురాలు..

ఇటీవలే ఓ కాలనీలో వృద్ధురాలు ఉదయం వాకిలి ఊడుస్తుండగా, ఆమె మెడ నుండి ఓ దొంగ బంగారం గొలుసు లాక్కుని పారిపోయిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న చందానగర్ పోలీసులు తక్షణమే స్పందించి దొంగను పట్టుకొని తన బంగారపు గొలుసును తిరిగి అప్పగించినందుకు బాధితురాలు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం బంగారం ధర లక్షకు పైగా పలుకుతుందని, ఒకవేళ పోలీసులు దొంగను పట్టుకోవడంలో విఫలమై ఉంటే తాను జీవితంలో బంగారం గొలుసు కొనుక్కోవడం సాధ్యపడేది కాదని ఆమె పేర్కొన్నారు.

### ఫోన్ పోగొట్టుకున్న ఓ మహిళ కామెంట్స్..

చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ తన ఫోన్ దొంగలించబడిందని చందానగర్ క్రైమ్ వింగ్‌ను ఆశ్రయించింది. తన కంప్లైంట్ కాపీలో, ఇటీవలే తనకు నిశ్చితార్థం జరిగిందని, తనకు కాబోయే భర్త ఆ ఫోన్‌ను బహుమతిగా ఇచ్చారని పేర్కొంది. ఆ ఫోన్ తనకు ఎంతో ముఖ్యమని, ఎట్టి పరిస్థితుల్లోనూ తనకు దక్కేలా చూడాలని పోలీసులకు ఫిర్యాదు లేఖలో విన్నవించుకుంది. ఆమె కంప్లైంట్‌ను చదివిన పోలీసులు చలించి, ప్రత్యేక దృష్టి పెట్టి అతి తక్కువ సమయంలోనే తిరిగి ఆమెకు ఫోన్ అప్పజెప్పడంతో, ఆ మహిళ పోలీసులకు కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేసింది.



## సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

### విద్యా, వైద్యం సమపాలుగా అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు: వి.జగదీశ్వర్ గౌడ్

శేరిలింగంపల్లి, జూలై 31(వాయిస్ టుడే): గతంలో ఎప్పుడు లేని విధంగా తెలంగాణ ప్రజల ఆరోగ్యం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. పేద ప్రజలకు ఆరోగ్య విషయంలో సీఎం సహాయనిధి వరం లాంటిదని,ప్రజా ప్రభుత్వం ఆరోగ్య తెలంగాణ దిశగా కృషి చేస్తుందని,గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 15 మంది లబ్ధిదారులకు 8,90,000/- రూపాయల చెల్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుపేదలకు ఆరోగ్య పరంగా అండగా నిలిచిందని,స్థానికంగా ప్రతి నెల సీఎం సహాయనిధి చెక్కుల లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అనారోగ్యంతో చికిత్స పొందిననంతరం, తమ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సహాయం అందుతుందని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా రాష్ట్రంలో నిరుపేద కుటుంబాలకు ఎల్ ఓ సి ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందిస్తున్నామని అన్నారు. విద్యా,వైద్యం సమపాలుగా అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.భగవంతుడి ఆశీస్సులతో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మియపూర్‌లో స్కూల్ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి



శేరిలింగంపల్లి, జూలై 31(వాయిస్ టుడే): స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మృతుడు నాగరాజు, నిజాంపేట్ రోడ్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ ఇన్చార్జిగా పనిచేస్తున్నాడు. పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై గోకుల్ ప్లాట్స్ నుండి మాతృశ్రీ నగర్ వైపు వెళ్తుండగా గ్లోబల్ ఎడ్జ్ స్కూల్‌కు చెందిన స్కూల్ బస్సు ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాల పాలైన నాగరాజును స్థానికులు వెంటనే మాదాపూర్ లోని యశోద హాస్పిటల్ కు తరలించారు. చికిత్స పొందుతున్న నాగరాజు మృతి చెందడంతో కేసు నమోదు చేసుకున్న మియపూర్ పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- హైడ్రా కమిషనర్ రంగనాథ్ ని బుద్ధ భవన్ లో మర్యాద పూర్వకంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి కలిసి ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కాప్రా, నాచారం డివిజన్ పరిధిలోని హెచ్ఎంటి నగర్, చెరువు,పటేల్ కుంట, అలాగే రామాంతాపూర్ పెద్ద చెరువు, చిన్న చెరువుల్లో సుందరీకరణ పూడిక తీత గురించి చర్చించారు. సానుకూలంగా స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ త్వరలోనే వచ్చి అన్ని చెరువులు చూసి పనులు ప్రారంభిస్తానని ఆయన తెలిపారు. రేపు రామంతపూర్ చెరువుకి వచ్చి పరిశీలిస్తాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్, గంధం నాగేశ్వర్ రావు, బైరీ నవీన్ గౌడ్, నేమూరి మహేష్ గౌడ్ కాలేరు నవీన్, ఇంద్రయ్యా, జెట్ట కిషోర్, భాషపల్లి నిరంజన్ చారి, రాంరెడ్డి, ఉపేందర్, కట్ట బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్‌లో గల మహంకాళి అమ్మవారి బోనాల సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ తెలకల మోహన్ రెడ్డి ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డిని సాధారంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేయించారు.

- ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి)

## మహాంకాళీఅమ్మ ,ఈదమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేసిన ఉప్పల్ కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి దంపతులు



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ఉప్పల్ లోని మహాంకాళీ అమ్మ ఈదమ్మ ఆలయాలలో బోనాల పండుగ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి లు అమ్మవార్లను దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. బోనాలను పురస్కరించుకొని గురువారం ఉదయాన్నే అమ్మవార్లను రజితపరమేశ్వర్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో మహాంకాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ తెలకల మోహన్ రెడ్డి,ఇదమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ తో పాటు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, పట్టణ ప్రముఖులు అభిమానులు పాల్గొన్నారు.







## చెట్లను నాటి వాటిని పరిరక్షిద్దాం.... భావితరాలకు స్వేచ్ఛా వాయువును అందజేద్దాం

### బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

కుత్బుల్లాపూర్, జులై 31(వాయిస్ టుడే) : 127 - రంగారెడ్డి నగర్ డివిజన్ ఏ.పీ.హెచ్.బి కాలనీలోని జిహెచ్ఎంసీ పార్క్ - 1 లో ఏ.పీ.హెచ్.బి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అటవీశాఖ వారు ఏర్పాటుచేసిన వన మహొాత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై చెట్లను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... భావితరాలకు స్వేచ్ఛా వాయువును అందించేందుకు ప్రతీ ఒక్కరూ చెట్లను నాటడమే కాదు, వాటిని పరిరక్షించాలన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్, డీసీ నర్సింహా, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రఘువీర్ రెడ్డి, హార్టికల్చర్ యూబీడీ దివ్య, సీఐ నరసింహ రాజు, ఏ.పీ.హెచ్.బి కాలనీ వాసులు ఎర్వ సాయికిరణ్ (బంటి), భాష, జగన్, రత్తయ్య, రమణయ్య, సుధాకర్ రావు, వెంకట్ రెడ్డి, ఓం ప్రకాష్, స్థానిక నాయకులు ఎర్వ శంకరయ్య, సుధాకర్, ఓంకార్ రెడ్డి, క్రాంతి యాదవ్, కార్తీక్ గౌడ్, సతీష్ గట్టోజీ, తారక రాణి, ఈశ్వరి, బాలు నేత, కొండ శ్రీను, గౌస్, అల్లావుద్దీన్, కిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## జిహెచ్ఎంసి పారిశుద్ధ కార్మికులకు వ్యక్తిగత రక్షణ పరికరాల పంపిణి కార్యక్రమం

కుత్బుల్లాపూర్ జులై 31(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధి కుత్బుల్లాపూర్ గ్రామం బీజేపీ కార్పొరేటర్ కార్యాలయం లో జిహెచ్ఎంసి అందిస్తున్న వ్యక్తిగత రక్షణ పరికరాలను(పీపీఈ కిట్లను) కుత్బుల్లాపూర్ సర్కిల్ 132 జీడిమెట్ల డివిజన్ పరిధి లో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులకు ( జిహెచ్ఎంసి) వ్యక్తిగత పరికరాలను అందజేసిన 132 జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రారెడ్డి. ఈ కార్యక్రమం లో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి , ఏ ఎం హెచ్ ఓ కవిత ,డివిజన్ కి సంబందించిన ఎస్ఎఫ్ఐ లు,బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు పారిశుద్ధ సిబ్బంది పాల్గొన్నారు.

## సింగల్ యూస్ ప్లాస్టిక్ నివారించడానికి ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు




కుత్బుల్లాపూర్ జులై 31(వాయిస్ టుడే): రాష్ట్రంలో హైదరాబాదులో విచ్చలవిడిగా నాణ్యతలేని కవర్లు వాడడం వల్ల అట్టి కవర్లు ఇస్తరాకులు మోరీల్లో డ్రైనేజీల్లో నుండి హైదరాబాద్ వర్షం వచ్చినప్పుడు మునిగిపోతుందని, గోమాత, జలమత, బుమతాను, కాపాడినవారము,కావున దీనిపై నిర్ణయం తీసుకున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలపరుస్తూ ఇది తయారీదారులపై కఠిన నిర్ణయాలు తీసుకోవాలని కంపెనీ యజమానులకు జైలు శిక్ష విధించే విధంగా చట్టం తీసుకురావాలని దీనితో పర్యావరణమే కాకుండా ప్రజల ఆరోగ్యాలు చెడిపోయి క్యాన్సర్ వివిధ రోగాలకు అవుతున్నారని ప్రముఖ డాక్టర్ నాగేశ్వరరావు చెప్పడం కూడా మనం పేపర్లో చదివే ఉన్నాం. ఈ నిర్ణయానికి కట్టుబడి ఉండి ప్రజలను అవగాహన కల్పిస్తూ పాఠశాలల్లో మందిరాల వద్ద ప్లెక్సీలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కో ల రవీందరముది రాజ్ పర్యావరణ ప్రేమికుడు సూచించారు దీనివలన గ్రామ రైతు లకు ఉపాది, మోదుగ, అరటి మొక్కలు, పెంచుతారు, దాని వలన పశువుల కు దాన, పంటకు యేరువు, లభించును.




## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

### ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ జులై 31(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు, వివిధ కాలనీల సభ్యులు, మరియు తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు.. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు. అదే విధంగా పలు ప్రాంతాలలో జరగబోయే వివిధ శుభకార్యాల వేడుకలు మరియు బోనాల ఉత్సవాల వేడుకల్లో పాల్గొనాలని పలువురు ఆహ్వాన పత్రికలను అందజేశారు..

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
శుక్రవారం, 1 ఆగష్టు 2025

# అమ్మపాలు అమృతాలు వీడియో సాంగ్ ఆవిష్కరణ

### డా. సురేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్మాణం

### భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఆవిష్కరణ



లకిడికపూల్ : జులై 31 ( వాయిస్ టుడే) తల్లిపాల ప్రాధాన్యతను చాటి చెప్పే "అమ్మపాలు అమృతాలు" వీడియో సాంగ్ ను రవీంద్రభారతిలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ప్రముఖ గాయకులు రామాచారి గారు ఈ పాటను విడుదల చేశారు.

సిరిసిల్లకు చెందిన అమృత మరియు హిమాన్షి పిల్లల హాస్పిటల్స్ అధినేత, నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ సురేంద్రబాబు గారి ఆధ్వర్యంలో "అమ్మపాల వారోత్సవాలు" సందర్భంగా ఈ పాట రూపొందించారు.

ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్ కుమార్ గారు రచించిన ఈ పాటను వర్ధమాన గాయకుడు గుండ్లూరు రవీంద్రబాబు స్వరపరిచారు. సంగీతాన్ని మహేందర్ శ్రీరాముల అందించారు. వేగవంతంగా సాగుతున్న ఆధునిక జీవనశైలిలో తల్లులు పాలివ్వడం మరిచిపోతుండటంతో, ఆ కారణంగా పిల్లలకు కలిగే నష్టాలను ఈ పాట ద్వారా చెప్పాలన్నదే తమ లక్ష్యమని డా. సురేంద్రబాబు తెలిపారు. ఆధునిక కాలంలో అమ్మల లాలన పిల్లలకు కరువైందని ఈ పాటతో తల్లుల్లో మంచిని అవగాహన కలుగుతుందని అమ్మ పాల ప్రత్యేకత ఈ పాటలో అంతర్లీనంగా ఉందని సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పైడికొండల కిషోర్ కుమార్ , వెంకట్ బాలగోని, యోగా ఉపాధ్యాయుడు రామకృష్ణ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



# దేశంకోసం ప్రాణాలర్పించిన గొప్ప వీరుడు కెప్టెన్ వీర రాజరెడ్డి

### .. పలువురు రాజకీయ నాయకులు

నాచారం జూలై 31(వాయిస్ టుడే): దేశంకోసం ప్రాణాలర్పించిన గొప్ప వీరుడు కెప్టెన్ వీర రాజురెడ్డి అని పలువురు రాజకీయ నాయకులు పేర్కొన్నారు. కెప్టెన్ వీర రాజురెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని గురువారం హబ్సిగూడ స్ట్రీట్ నెం.8లో ఉన్న వీర రాజా రెడ్డి విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి మనంగా నివాళు లర్పించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ రావు, బేతి సుభాష్ రెడ్డితో పాటు వీర రాజారెడ్డి బావ మురళీధర్ రెడ్డి, సోదరి సుచిత్రా రెడ్డి, సోదరుడు ప్రశాంత్ రెడ్డి, యాదవ రెడ్డితో పాటు పలువురు పాల్గొని ఆయన విగ్రహానికి ఘననివాళులర్పించారు.

# భారత చైతన్య యువజన పార్టీ కార్యాలయం ప్రారంభం

బంజారాహిల్స్ 31 జులై (వాయిస్ టుడే.) భారత చైతన్య యువజన (BCY) పార్టీ అధ్యక్షుడు బోధ రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ రాజ్యాంగంరాసిన అంబేద్కర్ ఆశయాలు, స్వాతంత్రం తెచ్చిన గాంధీ ఆలోచనలు మన తెలుగు రాష్ట్రాల్లో మొక్కదశకు కూడా రాలేదు.. అనాదిగా అధికార ఉన్మాదంతో మదమెక్కిన రాజకీయ ఉగ్రవాదుల గుప్పిట్లో నిలువెల్లా దోపిడీకి గురవుతుంది.. మన తెలుగు రాష్ట్రాల్లో రెండు పార్టీల పాలనలో దోపిడీలు, దౌర్జన్యాలు విచ్చలవిడిగా పెరిగాయి.. వనరులను వదలడం లేదు, రైతులను బతకనీయడం లేదు, మహిళలకు భద్రత లేదు, భవితకు భరోసా లేదు, పేదలకు బతుకు లేదు, ఆస్తికి హామీలేదు!.. భారత చైతన్య యువజన పార్టీ... కుల, మత,జాతి, వర్గ, ప్రాంత బేధం లేకుండా ప్రజల పూర్తి స్థాయిలో అవసరమైన, రాష్ట్రాభివృద్ధికి కావలసిన మౌళిక అవసరాలను దృష్టి లో ఉంచుకొని అవినీతిరహిత తెలంగాణ..ఆంధ్రప్రదేశ్ దిశగా రాష్ట్రాన్ని తీర్చిదిద్ది ప్రజలందరికీ సహాయపడే విధంగా కొన్ని పార్టీ సిద్ధాంతాలు రూపొందించింది. వీటిని ప్రజలందరూ పరిశీలించి మీ అభిప్రాయాలను మాదృషికి తీసుకువచ్చి మరింత మెరుగైన పథకాలుగా తీర్చి మీకు సేవనందించే ప్రయత్నాన్ని సఫలీకృతం చేయుదురని కోరుకుంటున్నామన్నారు





# బీసీ రాజ్యాధికార సాధనకు ఉద్యమ కార్యచరణ సమావేశం

### తీన్మార్ మల్లన్న టీం బీసీ జేఏసీలో విలీనం

హైద్రాబాద్ జూలై 31(వాయిస్ టుడే):బీసీల రాజ్యాధికార సాధనలో కీలక మైలురాయిగా నిలిచే ఉద్దేశంతో ఘట్కేసర్ మండలం, కొర్రెముల లోని జేకే కన్వేనషన్ లో నిర్వహించిన ఉద్యమ కార్యచరణ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారు, కీలక ప్రకటన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.తీన్మార్ మల్లన్న టీమ్‌ను అధికారికంగా బీసీ జేఏసీలో విలీనం చేస్తున్నాను. రాబోయే రోజుల్లో బీసీ జేఏసీ కమిటీల్లో మల్లన్న టీం సభ్యులు కీలకపాత్ర పోషించనున్నారు," అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బిసి పొలిటికల్ జె.ఏ సి కోఆర్డినేషన్ కమిటి చైర్మన్ సుదగాని హరిశంకర్ గౌడ్, బిసి జె.ఏ సి ముఖ్య నాయకులు వి.జె.ఆర్ నారగోని , వట్టె జానయ్య యాదవ్, సంగెం సూర్యారావు, ఎలబోయన ఒడేలు యాదవ్, బందారపు నర్సయ్య గౌడ్ , నిమ్మల ఇందిరా,రజనీ కుమార్, భావన, ప్రసన్న వివిధ కుల సంఘాల ముఖ్య నాయకులు బీసీ జె.ఏ సి నాయకులు,మల్లన్న టిం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి తలసాని, పద్మారావు గౌడ్, గన్నవరం ఎమ్మెల్యే సత్యనారాయణ

నాచారం జూలై 31(వాయిస్ టుడే): సికింద్రాబాద్ నియోజక వర్గం బిఆర్ఎస్ సీనియర్ మహిళా నాయకురాలు ముత్యాల గీతాదయాకర్ రెండవ కుమార్తె మౌనికరావు, నితిన్కుమార్ వివాహ వేడుక పీబిఆర్ కన్వెషన్లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి. పద్మారావు గౌడ్, గన్నవరం ఎమ్మెల్యే సత్యనారాయణ, వివిధ పార్టీలకు చెందిన కార్పొరేటర్లు, నాయకులు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు.



# సంపూర్ణ రియల్ మార్గదర్శి ఈ పుస్తకం

### స్థిరాస్తి మార్గదర్శి పుస్తకావిష్కరణలో వక్తలు

రియల్ ఎస్టేట్ రంగం పట్ల పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవడానికి "స్థిరాస్తి మార్గదర్శి" పుస్తకం ఎంతగానో దోహద పడుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. రియల్ ఎస్టేట్ నిపుణులు కుడికాల ఓం ప్రకాష్ రచించిన 'స్థిరాస్తి మార్గదర్శి' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నాగోల్ లోని తెలుగు అసెట్స్ కార్యాలయంలో జరిగింది. కొత్తగా స్థలం కొనాలన్నా, ఇల్లు కట్టుకోవాలన్నా, ఏదైనా అపార్ట్మెంట్ ఎంపిక చేసుకోవాలన్నా పేరుకు తగ్గట్టే ఈ పుస్తకం ఒక మార్గదర్శిగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరికి సులువుగా అర్థమయ్యే విధంగా పుస్తక రచయిత ఓం ప్రకాష్ జాగ్రత్తలు తీసుకున్నారని కొనియాడారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రచయితతో పాటు తెలుగు అసెట్స్ యూట్యూబ్ ఛానల్ శ్రీనివాస్ చీకటి, రియల్ ఎస్టేట్ నిపుణులు సామల అంజయ్య, సీనియర్ జర్నలిస్ట్ సప్తగిరి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# బంజారాల తీజ్ వేడుక పోస్టర్ రిలీజ్

### తీజ్ ఉత్సవ కమిటీ నాయకుడు మోతిలాల్



సికింద్రాబాద్ జులై 31 (వాయిస్ టుడే): బంజారాల తీజ్ వేడుక బతుకమ్మ పండుగను పోలి ఉంటుందన్న బంజారాలకు తీజ్ పండుగ పురస్కరించుకొని బంజారాల కు సంప్రదాయ వస్త్రాలను పంపిణీ చేయాలని తీజ్ ఉత్సవ కమిటీ నాయకుడు మోతిలాల్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆగస్టు 16 నుండి 24 వరకు సరూర్నగర్ స్టేడియంలో తీజ్ పండుగ వేడుకలను నిర్వహిస్తున్నామని మోతిలాల్ తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్ ను ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ఆవిష్కరించారు. బంజారా మహిళలు, యువతుల ఆటపాటలు, నృత్యా లు, డప్పుల మధ్య భక్తిభావంతో తొమ్మిదిరోజులపా టు ఉపవాసాలు ఉండి ఉత్సవాలు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం తీజ్ పండుగను అధికారికంగా జరపాలని, తీజ్ పండుగకు నిధులను కేటాయించాలని ఈ సందర్భంగా మోతిలాల్ విజ్ఞప్తి చేశారు. సరూర్నగర్ లో నిర్వహించే తీజ్ ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మంత్రి సీతక్కలు ఆహ్వానిస్తున్నామని తెలిపారు.



# ప్రజా ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రతి పథకాన్ని అమలు చేస్తుంది

### టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్

కూకట్‌పల్లి, జులై 31(వాయిస్ టుడే) ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ బొమ్మ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జనహిత పాదయాత్ర కార్యక్రమానికి పరిగి నియోజకవర్గం రంగాపూర్ గ్రామం నుండి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పాదయాత్రకు, టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పరిగి నియోజకవర్గానికి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బయలుదేరారు.ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం సన్నదం చేయడానికి, కాంగ్రెస్ కేడర్లో ఉత్సాహంతో పాటు క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు అవకాశం ఉందని దానిని ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు.

# టీ పి సి సి ప్రచార కమిటీ చైర్మన్‌ని కలిసిన శ్రీజ్యోతి భీమ్ భరత్



చేవెళ్ల... జూలై 31(వాయిస్ టుడే)తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ %ు% మాజీ పార్లమెంటు సభ్యుడు మధు యాష్కీ గౌడ్ ని మర్యాద పూర్వకంగా కలిసి, పుష్ప గుచ్చం అందజేసిన రంగా రెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ .. మరియు ఎల్ బి నగర్ నియోజక వర్గం లోని మహిళా కాంగ్రెస్ కమిటీ లు వేయాలని పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు .

# తెలంగాణ కాంగ్రెస్ పార్టీ జనహిత పాదయాత్రలో మంత్రికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల... జూలై 31(వాయిస్ టుడే)తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీమతి "మీనాక్షి నటరాజన్" , టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శ్రీ "బొమ్మ మహేష్ కుమార్ గౌడ్" మరియు ఐటీ మంత్రి , రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు మొయినాబాద్ మండలం హిమాయత్ నగర్ చౌరస్తా వద్ద ఘన స్వాగతం పలికిన చేవెళ్ల శాసనసభ్యుడు కాలే యాదయ్య.ఎమ్మెల్యే మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి గజమాలతో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ జనహిత పాదయాత్రలో భాగంగా మార్గమధ్యలో ప్రజల మధ్యకు వెళ్లే సందర్భంగా... మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చిలుకూరు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునీ, స్వామివారికీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద బ్రాహ్మణులు వేద మంత్రోచ్చారణల ఆశీర్వదించారు.అనంతరం హిమాయత్ నగర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ ,బాబు జగ్జీవన్ రామ్ మరియు డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఓయులో నక్సల్స్ నరమేధం - మేధోమథనం మధనం

సికింద్రాబాద్ జులై 31(వాయిస్ టుడే): మార్టిన్ మెమోరియల్ రీసెర్చ్ ఇన్నిట్యూట్ (ఎంఎంఆర్ఐ) అధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ లో నక్సల్స్ నరమేధం – మేధోమథనం అనే అంశం పై కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎసిపి పానుగంటి చంద్రమౌళి, ఏబీవీపీ అఖిల భారత సహ సంఘటన కార్యదర్శి బాలకృష్ణ . సీనియర్ అడ్వకేట్ సురేందర్ రావు,ఎంఎంఆర్ఐ అధ్యక్షులు మురళి మనోహర్ ,సీనియర్ జర్నలిస్ట్ సురేష్ కొచ్చటిల్, సోషల్ వర్కర్ మాసాడి బాపూరావు ,సీఈవో ఎన్ హెచ్ టి వి సాయి కృష్ణ పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా రిటైర్డ్ ఏసీపీ చంద్రమౌళి మాట్లాడుతూ.. పల్లెల్లో కొంత ఉద్రిక్తపరులుగా వున్న వారిని తీసుకెళ్లి, నక్సలిజం సిద్ధాంతాన్ని రుద్ది, వారిని అలా తయారుచేసేవారన్నారు. అసలు ఏ వర్గ శత్రువుల కింద నక్సలైట్లు ఆరెస్సెస్ కార్యకర్తలను చంపారని నిలదీశారు. ఏ ఒక్క రోజు కూడా ఏ ఒక్క ఆరెస్సెస్ కార్యకర్త కూడా నక్సలిజం, మార్క్సిజం డౌన్ డౌన్ అన్నవాళ్లను తాను చూడలేదన్నారు.

నక్సలిజానికి వ్యతిరేకంగా మాట్లాడేవారు, నడుచుకునేవారు, సైద్ధాంతికంగా విభేదించేవారెవ్వరూ వుండకూడదన్నదే నక్సలైట్ల ఆలోచన అని అన్నారు. నక్సలైట్లకు ఓ సిద్ధాంతమంటూ ఏమీ లేదని, తామే బలవంతులం కావాలన్నదే నక్సలైట్ల సిద్ధాంతమన్నారు. కానీ పైన ఈశ్వరుడంటూ ఒకడు వుంటాడని, వారికి అడ్డుకట్ట వేశారన్నారు. ప్రస్తుతం నక్సలిజం రూపు, పేరు లేకుండా పోయిందన్నారు. ఈ అడ్డుకట్టను ఇలాగే నిలబెట్టాలని లేదంటే ఏదో ఒక రూపంలో నక్సలైట్లు వస్తూనే వుంటారన్నారు. వున్న వారిని చూసి ఓర్వలేకపోవడం అన్న దాంట్లో నుంచే అసంతృప్తవాదం పుట్టుకొస్తుందని మూలభావనను ఆయన ఆవిష్కరించారు.

అదేవిధంగా సామాజిక కార్యకర్త డాక్టర్ మాసాడి బాపురావు మావోయిస్టు ప్రయాణం గురించి మాట్లాడుతూ..భారత్ లో 1920 లో ఎం.ఎన్. రాయ్ కమ్యూనిస్టు పార్టీని ప్రారంభించారని, కానీ.. అది భారత్ లో స్థాపించబడలేదని, రష్యాలో ప్రారంభించారన్నారు. సహజంగా అందరూ అనుకుంటున్నట్లు బోల్షివిక్ విప్లవం లెనిన్ చేతుల మీదుగా రాలేదన్నారు. ఈ సమయంలో లెనిన్ జర్మనీలో వున్నాడని కానీ.. అందరూ లెనిన్ తెచ్చాడని ఊదరగొడుతుంటారన్నారు. రష్యాలో విప్లవం సాధ్యమైందని, అందుకే భారత్ లో కూడా విప్లవం రాబోతోందని కలలు కన్నారని ఎద్దేవా చేశారు. కానీ భారత్ లో 100 సంవత్సరాల తర్వాత కూడా విప్లవం రాలేదన్నారు. తన పిల్లల్ని తానే తినే జీవిలాగా.. కమ్యూనిస్టులు కోటి ఇరవై లక్షల మందిని ఒక్క రష్యాలోనే చంపేశారన్నారు.

ఈ రక్తపాతం ప్రపంచమంతా సాగిందన్నారు. రక్తపాతమే దాని స్వరూపమని, రక్తదాహమే దాని స్వభావమని పేర్కొన్నారు. మొదట మనుషుల్ని చంపిన తర్వాతే, సిద్ధాంతం చెప్తారన్నారు.తుపాకీ గొట్టం ద్వారానే మార్పువస్తుందని పదే పదే చెబుతుంటారని, ఇదే దీనికి తార్కాణమని అన్నారు. నిజాంకి వ్యతిరేకంగా పోరాడతామని చెప్పిన కమ్యూనిస్టులు ప్రజలను నానా ఇబ్బందులు పెట్టారన్నారు.వీరి గురించి సహజంగా ఓ నానుడి ప్రచారంలో వుందని "దిన్ కా రాజా.. రాత్ కా రాజా" అని అన్నారు. దినంలో రజాకార్లతోని ఇబ్బందులు పడితే.. పల్లె ప్రజలు రాత్రి సమయాల్లో కమ్యూనిస్టులు ప్రజల్ని ఇబ్బందిపెట్టేవారని వివరించారు.

కాబట్టి కమ్యూనిస్టుల ప్రాథమిక సూత్రం తన ప్రజల్ని తాము చంపడమే అన్న సిద్ధాంతమని బాపూరావు విమర్శించారు.నిజాం లొంగిపోయినా.. కమ్యూనిస్టులు తమ పోరాటాన్ని ఆపలేదని, భారత్ పై సాయుధ పోరాటం చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. 1951 సమయంలో చర్చలు అని ప్రభుత్వం చెప్పినా.. రాలేదన్నారు. కానీ.. స్టాలిన్ చెప్పాడని కమ్యూనిస్టులు ఆయుధాలు విడిచిపెట్టేశారన్నారు. పోలీసు యాక్షన్ లో కమ్యూనిస్టులు నాలుగు వేల మంది దళ సభ్యులు చనిపోయారని, వీరికి సంబంధించిన పూర్తి రికార్డులు కమ్యూనిస్టుల వద్ద వుంటాయని, కానీ సాధారణ ప్రజలు 8 వేల మంది చనిపోయినా.. వారి రికార్డులే లేవన్నారు. సాధారణ ప్రజల రికార్డులు, మరణాల గురించి కమ్యూనిస్టులు ఊసెత్తరని మండిపడ్డారు.కానీ.. చివర్లో పుచ్చలపల్లి సుందరయ్య మాట్లాడుతూ.. ఇక్కడి ప్రజల ప్రజాస్వామిక ప్రయత్నాలు అర్థం చేసుకోలేదని తన ఆత్మకథలో రాసుకున్నారన్నారు. దాదాపు 12 వేల మంది చనిపోయిన తర్వాత మెల్లిగా ఇలాంటి కబుర్లు, సిద్ధాంతాన్ని చెప్పారన్నారు.

అయితే.. తమ సిద్ధాంతంతో ఇప్పుడే విప్లవం రాదని, రాబోయే రోజుల్లో వస్తుందని ప్రజల్ని నమ్మబలుకుతారని ఎద్దేవా చేస్తారు. ఆ తర్వాత సీపీఎం నుంచి విడివడిన కొందరు నక్సల్బరీ గ్రామంలో నక్సలైట్ పార్టీని స్థాపించారన్నారు. వసంతమేఘం గర్జిస్తుంది, విప్లవం రాబోతోందంటూ పిలుపునిచ్చారని, ఆ తర్వాత కూడా పార్టీ మూడు ముక్కలైందన్నారు. ఆ తర్వాత చైనా చైర్మనే తమ చైర్మన్ అని చెప్పారని, భారతీయులను నియమించలేదన్నారు. ఎక్కడి ప్రజల శ్రేయస్సు కోసం మావోయిస్టు పార్టీ స్థాపించారో తెలుసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తమను గుడ్డిగా ఫాలో అవ్వదని చైనా నేతలే చెప్పినా.. ఇక్కడి కమ్యూనిస్టులు వినలేదని, విపరీతమైన స్వామి భక్తిని ప్రదర్శించారని ఎద్దేవా చేశారు.ఊహాజనితంగా ప్రారంభమైన ఓ ఉద్యమం... వివిధ ప్రాంతాల గుండా తెలంగాణలోకి



వచ్చిందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలోని జాతీయవాదులను నక్సలిజం చాలా ఇబ్బందులు పెట్టిందని, నక్సలైట్లు నరమేధమే సృష్టించారన్నారు. 1972 నుంచి ఇప్పటి వరకు చాలా మందిని చంపేశారన్నారు. ఆర్ఎసీ పేరుతో అనేక మంది అమాయకులను ప్రభావితం చేశారని మండిపడ్డారు.

### రాజ్యాంగంపై నమ్మకం లేని వారు హక్కుల గురించి మాట్లాడొద్దు : సురేందర్ రావు

ఎదుటివాడి హక్కులు ప్రారంభమయ్యేంత వరకే ప్రజాస్వామ్యంలో మరో వ్యక్తి స్వతంత్ర పరిధి వుంటుందని ప్రముఖ న్యాయవాది, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేందర్ రావు అన్నారు. ఎదుటి వ్యక్తి హక్కును హరించనంత వరకే స్వేచ్ఛగా మాట్లాడే హక్కు వుంటుందన్నారు. అంతేకానీ ప్రజాస్వామ్యంలో తనకు స్వేచ్ఛ వుంది కదా అని.. ఓ హద్దూ పద్దూ లేకుండా తన భావాలను ప్రకటిస్తానని, ఎదుటి వాడితో ఘర్షణకు దిగుతానంటే కుదరని పని అని తేల్చి చెప్పారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి హక్కులనూ పరిరక్షించే బాధ్యత ప్రజాస్వామ్యంగా ఎన్నికైన ప్రభుత్వాలపై వుంటుందని, అయితే..అయితే రాజ్యాంగ పరిధిలో వుంటేనే అది కుదురుతుందని, కానీ.. వీటిని ఉల్లంఘిస్తే మాత్రం ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందన్నారు. ఎందుకంటే ఎదుటి వ్యక్తిని కూడా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుందన్నారు. ఎదుటి వాడి చేతిలో తుపాకులు వుండటం వల్ల ఎదుటి వ్యక్తి స్వేచ్ఛగా తన అభిప్రాయాన్ని చెప్పలేడని, అప్పుడు ప్రభుత్వం రక్షణ కల్పించాల్సిందేనన్నారు.

అంతేగానీ.. తుపాకులు పట్టుకొని అడవులకు వెళ్తాం, ప్రజల్ని చంపుతాం అంటే కుదరని పని అని తేల్చి చెప్పారు. ఆర్టికల్ 19 ప్రకారం చేతిలో తుపాకులు పట్టుకోవడం తప్పు అని, ఎందుకంటే ఎదుటి వారిని బెదిరించినట్లేనని అన్నారు. పరోక్షంగా ప్రభుత్వాలను కూడా బెదిరించినట్లే అవుతుందని, అప్పుడు ప్రభుత్వాలు సైలెంట్ గా వుంటే రాజ్యాంగానికి విరుద్ధమవుతుందన్నారు. ఆర్టికల్ 250 ప్రకారం లా అండ్ ఆర్డర్ ను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై వుంటుందన్నారు.

ప్రభుత్వ విధనాలతోగానీ, ప్రభుత్వంతో గానీ విభేదించే హక్కు ప్రతి ఒక్కరికీ వుంటుందని ,అయితే.. తమను తాము రక్షించుకునే హక్కు కూడా అంతే వుంటుందన్నారు. అంతేగానీ.. తుపాకులు పట్టుకొని తిరుగుతామని, ప్రజల్ని భయపెడతామంటే కుదరని తేల్చి చెప్పారు. ఇక.. ఈ ప్రజల్ని కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై కూడా వుందన్నారు. ఒక్కోసారి నక్సలైట్లకు, పోలీసులకు ఎదురు కాల్పులు కూడా జరుగుతాయని, ఈ సమయంలో తమని తాము కాపాడుకునే హక్కు పోలీసులకు కూడా రాజ్యాంగం ప్రసాదించిందన్నారు.

అయితే.. ఎన్ కౌంటర్ లు అయిపోగానే నక్సలైట్లే ఎందుకు చనిపోయారని కొందరు పదే పదే ప్రశ్నలు వేస్తుంటారని, ఎందుకంటే ప్రభుత్వం దగ్గర మౌలిక సదుపాయాలు బాగుంటాయని, ఆయుధాలు కూడా అత్యాధునికంగా వుంటాయని, ఇంటెలిజెన్స్ కూడా వుంటుందన్నారు. ఎప్పుడూ అసమానంగా వున్న వ్యక్తుల మధ్యే ఎదురు కాల్పులు జరుగుతాయి కాబట్టి, పోలీసులదే పైచేయి అవుతుందన్నారు.ఎన్ కౌంటర్ అయిన ప్రతిసారీ బాధితుల పాత్ర పోషించడం అలవాటైపోయిందని మండిపడ్డారు.

తమకు రాజ్యాంగం పట్ల గానీ, పార్లమెంట్ వ్యవస్థ పట్ల గానీ, ప్రభుత్వాల పట్ల గానీ తమకు నమ్మకే లేదని చారుమజుందార్ తో పాటు చాలా మంది నక్సలైట్ నేతలు పదే పదే చెప్పారని సురేందర్ రావు గుర్తు చేశారు. అలాంటప్పుడు రాజ్యాంగం గురించి గానీ, రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల గురించి గానీ మాట్లాడే హక్కు నక్సలైట్లకు లేనే లేదని నొక్కి చెప్పారు.

### చావు దగ్గరికి వచ్చింది కాబట్టే శాంతి చర్చలు అంటున్నారు

### మురళీ మనోహర్

చట్టాల విషయంలో మావోయిస్టులు మాట్లాడినట్లు ఎవ్వరూ మాట్లాడరని, అత్యంత మానవత్వంతో మాట్లాడతారని, అయితే.. చివరికి మాత్రం తుపాకీ గొట్టం, రాజ్యాధికారం దగ్గరికే వచ్చి ఆగిపోతుందని విద్యా భారతి జాతీయ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ మురళీ మనోహర్ అన్నారు. తమ పోరాటం సమసమాజం కోసం అని చెబుతూ వుంటారని, అదో భ్రమ అని, అది ఎక్కడా స్థాపించలేదని ఎద్దేవా చేశారు.

ఆపరేషన్ కగార్ ప్రారంభమైన తర్వాత శాంతి చర్చలు అన్న మాట బాగా వ్యాప్తిలోకి వస్తోందని, బుద్ధుడు, గాంధీ సమయంలోనూ ఇంత శాంతి వినబడలేదని ఎద్దేవా చేశారు. చావు సమయం దగ్గరికి వచ్చిన తర్వాత, వేరే దిక్కు లేక శాంతి చర్చలు అంటున్నారన్నారు. సమాజంలో శాంతి సమయం, యుద్ధ సమయం అని రెండే దశలు వుంటాయని, శాంతి గురించి ప్రస్తావన శాంతి సమయంలోనే జరగాలని, కానీ.. యుద్ధ సమయంలో మావోయిస్టులు, వారి సానుభూతిపరులు ఎందుకు శాంతి చర్చలు అంటున్నారని సూటిగా ప్రశ్నించారు. చావు దగ్గరికి వచ్చింది కాబట్టే శాంతి శాంతి అని వల్లెవేస్తున్నారని, కానీ సమాజం శాంతియుతంగా వున్న సమయంలో బాంబులు పెట్టి, నాన బీభత్సం సృష్టించి, అశాంతిని రేపుతారన్నారు.

గతంలో కాకతీయ ఫాస్ట్ ప్యాసింజర్ రైలు కింద బాంబు పెట్టిన తర్వాత సారీ సారీ అన్నారని, పోయిన ప్రాణాలను తెచ్చిస్తారా? అంటూ నక్సలైట్లను సూటిగా ప్రశ్నించారు.తుపాకీ ద్వారానే రాజ్యాధికారం కావాలని అంటున్నారని, మరి అంబేద్కర్ రాజ్యాంగం వద్దని చెప్పే ధైర్యం సోకాల్డ్ మేధావులకు వుందా? అని నిలదీశారు.

ప్రపంచం మారిపోతున్న పరిస్థితుల్లో రాతి యుగంలో వున్నట్లు తుపాకులు మెడలో వేసుకొని, డప్పులు కొట్టుకుంటూ, విప్లవ పాటలు పాడుతూ ప్రజలను భ్రమల్లో వుంచుతున్నారని విరుచుకుపడ్డారు. 65 ఏళ్లలో ప్రొఫెసర్ హరగోపాల్ మారలేదని, వారి చుట్టూ వున్న వ్యవస్థలూ మారలేదని ఎద్దేవా చేశారు. నక్సలైట్లు, వారి సానుభూతిపరులు మార్పుకు ఏమాత్రం సిద్ధంగా లేరని విమర్శించారు. బుద్ధుడు కూడా చెప్పలేని స్థాయిలో నక్సలైట్లు శాంతి జపం చేస్తున్నారని మురళీ మనోహర్ చురకలంటించారు.

ఆపరేషన్ కగార్ సమయంలో నక్సలైట్లు, వారి సానుభూతిపరులు శాంతి చర్చలు శాంతి చర్చలు అని పదే పదే అన్నారని, ఇప్పుడు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. గతంలో కలిసినట్లుగా జనజీవన స్రవంతిలో కలవాలని, చర్చలు బూటకమని, శాంతిచర్చలు ఓ నాటకమని ధ్వజమెత్తారు. అసలు నక్సలైట్లు ఏ హోదాలో చర్చలు జరపాలని డిమాండ్లు చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం ప్రతినిధులనైనా ప్రకటించారా? అని ప్రొఫెసర్ మురళీ మనోహర్ ప్రశ్నించారు. సంపద సృష్టించిన వారిదే సంపద అని నక్సలైట్లే చెప్పారన్నారు. శాంతి చర్చల్లో వున్న బూటకాన్ని గల్లా పట్టుకొని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

సమాజంలో లేని భయాన్ని వున్నట్లు నక్సలైట్ సానుభూతిపరులు సృష్టిస్తున్నారని, గతంలో వారిష్టం వచ్చినట్లు వ్యవహారాలు చేసి, విద్యార్థులను నక్సలైట్లుగా మార్చారన్నారు. కానీ పరిస్థితి ఇప్పుడు అలా లేవన్నారు. కల్బుర్గీ, గౌరీ లంకేష్ వంటి వారిని గుర్తు చేస్తూ యువకులను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు.

నక్సలైట్ మేధావులు ఎంత మొత్తుకున్నా ఇప్పటి యువతరం వారి మాటలు వినే స్థితిలో లేరని, నక్సలైట్లు తమను రాతియుగం వైపు తీసుకెళ్తున్నారన్న విషయం వారికి అర్థమైపోయిందని మురళీ మనోహర్ అన్నారు.

ఈ సందర్భంగా ఎబివిపి అఖిల భారత సహ సంఘటన కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ బ్రిటిష్ టైంలో దేశభక్తులు, దేశద్రోహులు ఎట్లా అయితే ఉన్నారో, ఇప్పుడు మేకింగ్ ఇండియా ఫోర్సెస్, బ్రేకింగ్ ఇండియా ఫోర్సెస్ మధ్యలో జరుగుతున్నటువంటి ఈ యుద్ధంలో, ఎప్పుడు కూడా ధర్మమే గెలిచింది, ధర్మమే గెలుస్తుంది. ఈ విషయాన్ని ఇప్పుడున్నటువంటి జనరేషన్ కి అర్థం చేసుకోవాలి. కాబట్టి ఇప్పుడు ఓడిపోయాడు రావణాసురుడు ఓడిపోయాడు, దేశద్రోహులు ఓడిపోయారు, నక్సలిజం అంతం వస్తుంది, అంతం అవుతుంది. కానీ దాని కోసం వ్యయాన్ని కలిగినటువంటి అవసరం ఉంటుంది, మిత్రులారా! దాన్ని ఇప్పుడున్నటువంటి జనరేషన్ అర్థం చేసుకోవాలి. మనం స్లోగన్స్ ఇస్తుంటాం: ఏమి? కమ్యూనిజం ఒక కల, అది కరిగిపోయిన మంచు, ఇలా అని చెప్పేసి. కమ్యూనిజం ఒక కల, అది కరిగిపోయిన మంచు ఇలానే, నిజంగానే కరిగిపోయిన మంచు ఇలానే. కానీ మనం, ఈ ఇది ఉంటది కదా, కాలం ఈ వరదలో కొట్టుకుపోయేటప్పుడు పీచునైనా సరే పట్టుకొని బ్రతకాలనేటువంటి ప్రయత్నం చేసుకున్నారు. అందుకనే ప్రభుత్వాలను కూడా ఇన్ఫ్లుయెన్స్ చేస్తున్నారు. ఈ యొక్క ప్రభుత్వాల యొక్క ద్వంద్వరీతిని ఎండగట్టాలి, సత్యాన్ని నిజాలని చేయాలి, మేకింగ్ ఇండియా ఫోర్సెస్ కి బ్రేకింగ్ ఇండియా ఫోర్సెస్ అంతమొందించేదాకా మేకింగ్ ఇండియా ఫోర్సెస్ పని చేయాలని చెప్పేసి తెలియజేస్తున్నాను. ఈ అవకాశమిచ్చినటువంటి మీ అందరికీ కూడా ధన్యవాదాలు తెలియజేసుకున్నాను.

### మావోయిస్టు హింసను వీడాలి –జనజీవన స్రవంతిలో కలవాలి

### ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా ఎంఎంఆర్ఐ డిక్లరేషన్.

ఆరు దశాబ్దాల క్రితం 'తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం' అనే నినాదంతో ప్రారంభమైన నక్సలైట్ ఉద్యమం, దురదృష్టవశాత్తు, మారణహోమాన్ని సృష్టించడమే ప్రధాన లక్ష్యంగా కొనసాగింది. 'వర్గ శత్రు నిర్మూలన' అనే సిద్ధాంతం పేరుతో, తోటి మానవులనే 'వర్గశత్రువులుగా' ముద్రవేసి ప్రాణాలు తీయడం ఈ ఉద్యమం యొక్క ధ్యేయంగా మారిపోయింది. తరగతిలో ఒకే బెంచ్‌పై కూర్చుని కలిసి చదువుకునే విద్యార్థులనే 'వర్గశత్రువులుగా' భావించి, వారిపై తుపాకీ ఎక్కుపెట్టడం ద్వారా నక్సల్స్ మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారు. విద్యార్థులు, యువతలో ఆశలు, ఆకాంక్షలు నింపాల్సిన ఉద్యమం, వారిని హింస వైపు మళ్లించి, ప్రాణనష్టానికి గురిచేసింది. ఆ తరువాతి రోజులలో, తాము ఎవరికోసం పోరాడుతున్నామని చెప్పారో, అదే పేదలను మరియు అట్టడుగు వర్గాల ప్రజలను లక్ష్యంగా చేసుకుని, వారి ప్రాణాలను తీస్తూ పోయారు. ఇది ఉద్యమం యొక్క మూల ఆశయాలకే విరుద్ధంగా నిలిచింది. ప్రజాస్వామ్య సమాజంలో స్వేచ్ఛగా జీవించే హక్కును కాలరాసింది. అటవీ ప్రాంతాలకు పరిమితమై, అమాయకత్వంతో ఆదివాసీల జీవితాలతో ఆడుకుంటున్నారు. గత రెండు దశాబ్దాలుగా, ఈ ఉద్యమం ప్రధానంగా దండకారణ్యం వంటి అటవీ ప్రాంతాలకు పరిమితమైంది. అక్కడ నివసించే అమాయక గిరిజన యువకులలో విషబీజాలు నాటుతూ, వారిని సాయుధ పోరాటంలోకి దించి, తీవ్ర ప్రాణనష్టానికి పాల్పడుతున్నారు. వారి పేదరికాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, అభివృద్ధిని అడ్డుకుంటూ, శాంతికి భంగం కలిగిస్తూ, తమ మనుగడను కొనసాగించే ప్రయత్నం చేస్తున్నారు. పాఠశాలలను ధ్వంసం చేయడం, రోడ్ల నిర్మాణాన్ని అడ్డుకోవడం వంటి చర్యల ద్వారా, ఆ ప్రాంత ప్రజల పురోగతిని, వారికి లభించాల్సిన కనీస సౌకర్యాలను నిరాకరిస్తున్నారు. ఇది కేవలం హింసకు మాత్రమే కాదు, ఆ ప్రాంతాల అభివృద్ధికి, అక్కడి ప్రజల భవిష్యత్తుకు కూడా ఆటంకంగా మారింది.

### హింస సమస్యకు పరిష్కారం కాదు

ప్రజాస్వామ్య వ్యవస్థలో, తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి, న్యాయం సాధించుకోవడానికి అనేక మార్గాలు ఉన్నాయి. చర్చలు, నిరసనలు, ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళనలు, మరియు చట్టబద్ధమైన పోరాటాల ద్వారా మార్పును తీసుకురావడం సాధ్యమవుతుంది. అయితే, నక్సలైట్ ఉద్యమం హింసను ఏకైక మార్గంగా ఎంచుకోవడం వల్ల, అది సమాజం నుండి వేరుపడి, తన ఆమోదాన్ని కోల్పోయింది. అమాయక ప్రాణాలను బలిగొని, విధ్వంసాన్ని సృష్టించడమే తప్ప, ఈ ఉద్యమం సుస్థిరమైన సామాజిక మార్పును తీసుకురాలేకపోయింది.

నక్సలిజం చరిత్ర ఒక విషాద గాథ. ఇది కేవలం ప్రాణ నష్టానికి మాత్రమే కాకుండా, సమాజంలో భయాన్ని, అశాంతిని నింపి, అభివృద్ధిని అడ్డుకుంది. ఈ ఉద్యమం యొక్క పతనం స్పష్టం చేసేదేమిటంటే, 'తుపాకీ గొట్టం' ఎన్నటికీ నిజమైన విప్లవానికి, శాశ్వత మార్పుకు దారి తీయదు. ప్రజాస్వామ్యం, మానవత్వం, మరియు శాంతియుత సహజీవనం మాత్రమే ఒక ఉన్నతమైన సమాజాన్ని నిర్మించగలవని మనం ఈ చేదు అనుభవాల నుండి నేర్చుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి హింసాత్మక ఉద్యమాలు తలెత్తకుండా ఉండాలంటే, సామాజిక న్యాయం, సమానత్వం, మరియు అభివృద్ధి అందరికీ అందుబాటులో ఉండేలా చూడటం మనందరి బాధ్యత అని ఎంఎంఆర్ఐ భావిస్తుంది.

మావోయిస్టులు తక్షణమే ఆయుధాలు అడవులను వదిలేయాలి అభివృద్ధికి సహకరించాలి, హింసా మార్గాన్ని వీడాలి ప్రజాస్వామ్యుతంగా ఉద్యమించాలి. బుల్లెట్ ద్వారా రాజ్యాధికారం అసాధ్యం బ్యాలెట్ ద్వారానే రాజ్యాధికారం సాధ్యమని, నరమేధం వీడి సమాజం కోసం మేధో మధనం చేయాలని మావోయిస్టులకు ఎం ఎం ఆర్ ఐ పిలుపునిస్తోది. ఈ కార్యక్రమంలో ఎం ఎం ఆర్ ఐ జనరల్ సెక్రటరీ రంజిత్ మోహన్, వెంకట్ రెడ్డి, ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రవణ్ ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షులు జనారెడ్డి రాష్ట్ర కార్యదర్శి రాంబాబు,రామకృష్ణ, రావుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పార్క్ ఓపెన్ జిమ్‌లకు శంకుస్థాపన



వాయిస్ టుడే న్యూస్, జులై 31 బోడుప్పల్ : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఓపెన్ జిమ్ లకు శంకుస్థాపన చేసిన బోడుప్పల్ కమిషనర్ ఏ. శైలజ, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,బోడుప్పల్ చెంగిచెర్ల పరిధిలో మహిత యంపవరింగ్ కమ్యూనిటీస్ వారి సహకారంతో ప్రభుత్వ పార్కు స్థలలలో గురువారం వివిధ కాలనీలో ప్రభుత్వ పార్కు స్థలాలలో ఓపెన్ జిమ్ కి శంకుస్థాపనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ అధికారి డి.ఇ. మరియు అధికారులు, ఒకటో డివిజన్ వార్డ్ ఆఫీసర్ వెంకటేష్, కాలనీల అధ్యక్షులు ,కార్యదర్శులు మరియు కాలనీ కమిటీ సభ్యులు, స్థానిక, ప్రజలు, మహిళలు పాల్గొనడం జరిగింది.

## 42 శాతం రిజర్వేషన్ల ద్వారానే బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో మెరుగైన అవకాశాలు

### అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజా శ్రీనివాస్

హైదరాబాద్, జూలై 31: తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల (బిసి) కు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో అవకాశాలు మెరుగుపడతాయని, అత్యంత వెనుకబడిన వడ్డెర సామాజికవర్గ ప్రజలకు న్యాయం జరుగుతుందని అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజా శ్రీనివాస్ ఎఐసిసి ఓబిసి డిపార్టుమెంట్ చైర్మన్ డా. అనిల్ జైహింద్ కు వివరించారు. రాజకీయ రంగంలో అత్యంత వెనుకబడిన వడ్డెర కులస్తులకు బిసి రిజర్వేషన్లు పెంచడం వల్ల స్థానిక సంస్థల ఎన్నికలలో రాజకీయంగా మరిన్ని ఎక్కువ అవకాశాలు వస్తాయని, వడ్డెరలు రాజకీయంగా ఎదిగేందుకు దోహదపడతాయని తెలిపారు. ఢిల్లీ లో ఏఐసీసీ కార్యాలయంలో గురువారం ఎఐసిసి ఓబిసి డిపార్టుమెంట్ చైర్మన్ డా. అనిల్ జైహింద్ తో గుంజా శ్రీనివాస్ భేటీ అయ్యారు. మరోవైపు తెలంగాణ బిసి రిజర్వేషన్ల బిల్లును సాధించుకునేందుకు ఆగస్టు 5, 6, 7 తేదీలలో ఢిల్లీలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, కాంగ్రెస్ ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టిన పోరాటానికి వడ్డెర సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందని గుంజ శ్రీనివాస్ చెప్పారు. ఢిల్లీలో మూడు రోజుల పాటు జరిగే బిసి రిజర్వేషన్ల పోరాటానికి తెలంగాణ తో పాటు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల వడ్డెర కులస్తులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లనున్నట్లు ఆయన చెప్పారు. తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసి తీరాల్సిందేనని ఆయన అన్నారు. కేంద్రంలో ఓబిసిల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసేందుకు, ఓబిసిల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర బడ్జెట్ ప్రత్యేకంగా నిధులను కేటాయించేందుకు కృషి చేయాలని డా. అనిల్ జైహింద్ కు గుంజ శ్రీనివాస్ ఆయన విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ సాధ్యమవుతుందని ఆయన ఉద్ఘాటించారు. తెలంగాణలో ఇప్పటికే ఉపముఖ్యమంత్రిగా ఎస్.సి సామాజిక వర్గానికి చెందిన మల్లు భట్టి విక్రమార్క ఉండడం, టిపిసిసి అధ్యక్షులుగా బిసి సామాజిక



వర్గానికి చెందిన బి. మహేష్ కుమార్ గౌడ్ ఉండడం సామాజిక న్యాయం పట్ల కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన వివరించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా కృషి చేస్తున్నారని, అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ సంస్థగతంగా మరింత పటిష్టవంతం చేసేందుకు ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ చర్యలు చేపట్టారని, కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లడం ద్వారా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ 'జనహిత' పాదయాత్ర ద్వారా కృషి చేస్తున్నారని డా. అనిల్ జైహింద్ కు గుంజ శ్రీనివాస్ వివరించారు.

# దేవస్థానంలో టెండర్ దారుల దారుణాలు

**దేవస్థానానికి కోట్లలో కుచ్చుటోపీ పెడుతున్న టెండర్ దారులు..**

**కోట్ల రూపాలతో వేసే టెండర్ దారుని ఆస్తుల వివరాల సేకరణ లేని టెండర్ల నిర్వహణన...!**

**కొత్త రూల్స్ విధించాలని నిపుణుల విజ్ఞప్తి...**

**టెండర్ దారుల ఆస్తిపాస్తుల వివరాలు దేవస్థానానికి సమర్పించే చర్యలు...**



యాదగిరిగుట్ట, జూలై 31(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో టెండర్ల నిర్వహణలో కోట్ల రూపాయలు గోల్ మాల్ అవుతున్నాయి. కొందరు టెండర్ దారులు అధికారులతో కుమ్మక్కై టెండర్ డబ్బులు సకాలంలో చెల్లించకుండా యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రానికి రావలసిన ఆదాయానికి గండి కొడుతున్నారు.

ఈ నేపథ్యంలో టెండర్ షెడ్యూల్ ప్రకారం గడువు లోపు టెండర్ బకాయి డబ్బులు పూర్తిగా చెల్లించని పక్షంలో టెండర్ దారులకు కోర్టు నోటీసులు పంపించడం దేవస్థానంలో ఆనవాయితీగా వస్తున్న ప్రక్రియ. పుణ్యక్షేత్రం ఆదాయానికి నష్టపరిచే టెండర్ దార్లకు చెక్కు పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. టెండర్ విధానాన్ని సరిచేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఎవరైతే టెండర్ దక్కించుకుంటాడో ఆ వ్యక్తి పూర్తి ఆస్తి వివరాలు ఆదాయ మార్గాలను బహిర్గత పరిచేలా నిబంధనలను సవరించాలని పలువురు నిపుణులు దేవస్థాన అధికారులను కోరుతున్నారు. దీనికి కారణం ఏమిటంటే గతంలో దేవస్థాన పరిదిలో పార్కింగ్ టెండర్ గడువు తీరిన పూర్తిగా దేవస్థానానికి చెల్లించాల్సిన బకాయిలను టెండర్ దారులు చెల్లించలేదు. అందుకు గాను దేవస్థానం కోర్టు ద్వారా సదరు టెండర్దారుడికి నోటీసులు జారీ చేయడం జరిగింది. ఇవే కాకుండా కొండ కింద విష్ణు పుష్కరిణి వద్ద షాపులు మరియు భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వసతి గృహాల సముదాయాలు లక్షల, కోట్ల రూపాలతో టెండర్ వేసి కైవసం చేసుకున్ని దేవస్థానానికి కుచ్చుటోపీ పెట్టిన టెండర్ దారుల పై దేవస్థానం వారు కోర్టు నోటీసులు వేసి దేవస్థానానికి కోర్టల రూపంలో మరియు టెండర్ల బకాయిల రూపంలో ఆదాయ పరంగా నష్టాలు చవిచూస్తున్నారు. ఇలాంటి నష్టాలు జరగకుండా ఉండాలంటే ముందస్తు చర్యగా టెండర్లలో పాల్గొన్నే వ్యక్తి యొక్క ఆస్తుల వివరాలు పూర్తిగా సేకరించి వారు వేసే టెండర్లకు అర్హులై ఉంటేనే టెండర్లకు అనుమతి ఇవ్వాలన్ని లేని పక్షంలో టెండర్ గడువు ముగిసిన తర్వాత టెండర్ షెడ్యూల్ ప్రకారం పూర్తి బకాయి చెల్లించకుండా దేవస్థానానికి చెల్లించాల్సిన డబ్బులలో కొంత దేవస్థానంలో పనిచేసే సిబ్బందికి లంచాల, కమీషన్ల రూపంలో చెల్లించి లక్షల, కోట్ల రూపాయల్లో దేవస్థానానికి ఆర్థిక నష్టాన్ని కలిగిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు.

గతంలో జరిగిన ఇలాంటి దుస్థితి తిరిగి జరగకుండా ఉండాలంటే ముందస్తు నిబంధనగా టెండర్ దారుల ఆస్తిపాస్తుల వివరాలు సేకరణ చేయాలని టెండర్లలో పాల్గొన్నే వ్యక్తి తమపూర్తి ఆస్తిపాస్తుల వివరాలను దేవస్థానం వారికి చెల్లించి ఆపై టెండర్లలో పాల్గొన్నే అర్హతను పొందేలా దేవస్థాన ఉన్నతాధికారులకు చర్యలు తీసుకోవాలని సూచనప్రాయంగా వినవిస్తున్నారు. దీని ద్వారా దేవస్థానానికి ఆదాయ పరమైన లోటుపాట్లు జరగకుండా మరియు టెండర్ దారులు సకాలంలో బకాయి కట్టే నిబద్ధత, కోర్టు వ్యవహారాల భారం తొలుగుతాయి...

## రిటైర్డ్ ఉద్యోగులను కొనసాగించరాదంటూ జీవో విడుదల చేసిన ప్రభుత్వం

యాదగిరిగుట్ట, జూలై 31(వాయిస్ టుడే): దేవాదాయ ధర్మాదాయ శాఖలో రిటైర్డ్ అధికారులను తిరిగి అవుట్ సోర్సింగ్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో నియామకం చేయడాన్ని రద్దు చేస్తున్నట్లు తెలంగాణ సర్కారు జీవో విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ ఎండోమెంట్స్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది, అధికారులు రిటైర్డ్ అయిన తరువాత మళ్లీ పైరవీలు చేసి ఉద్యోగాల్లో చేరి కిందిస్థాయి ఉద్యోగులకు ప్రమోషన్లు దక్కకుండా , అధికారాన్ని చెలాయిస్తున్న సంఘటనలు గత ప్రభుత్వ పాలనలో చోటు చేసుకున్నారు. ప్రస్తుత అధికార పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం రెవెన్యూ ఎండోమెంట్స్ శాఖలో రిటైర్డ్ అయిన వ్యక్తులు తిరిగి పదవి భాధ్యతలు స్వీకరించే పద్ధతిని తొలగిస్తూ జీవో విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో గతంలో దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారులు రిటైర్డ్ అయిన అధికారులను తిరిగి పదవి భాధ్యతలు అప్పగించి కిందిస్థాయి ఉద్యోగులకు అన్యాయం చేశారంటూ కొంతమంది దేవస్థాన ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఒక ఉద్యోగి ఇదే తరహాలో పైరవీలు చేస్తూన్నారని, పదవి కాలం తీరిన తరువాత కూడా తిరిగి ఉద్యోగంలో కొనసాగేందుకు పైరవీలు చేస్తుండటం శోచనీయం. దేవస్థానానికి చెందిన తోటి ఉద్యోగుల కు తుంగలో తొక్కె ప్రయత్నాలు చేస్తున్నారని దేవస్థానంలో పనిచేసే కొంతమంది ఉద్యోగులు అతనిపై ఆలయ ఈవోకు, మరియు దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారులకు ఫిర్యాదు చేస్తూ లేఖ అందించినట్లు యాదగిరిగుట్ట దేవస్థానంలో ఉద్యోగుల గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఒకవైపు తెలంగాణ రాష్ట్రంలో ఎలాంటి పైరవీలు జరగకుండా మరియు పదవి విరమణ అయిన తరువాత తిరిగి ఉద్యోగ భాధ్యతలు పొందాలనే ప్రభుత్వ జీవో విడుదల చేసినా పైరవీలు జరిపేవారు మాత్రం ఆగడంలేదు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటూనే వారికిచ్చే ప్రభుత్వ గౌరవ వేతనాన్ని రద్దు చేయాలని మరియు ఇలా అక్రమాలకు పాల్పడిన వారిని ఉద్యోగ సంఘాలు, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.



## తీజ్ పండుగలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట: బంజారా అక్క చెల్లెల్లతో డాన్స్ చేసిన బీర్ల అయిలయ్య యాదాద్రి భువన గిరి జిల్లా బొమ్మలరామారం మండలం లక్ష్మీ తండా, భూక్య తండాలో బంజారాల తీజ్ పండుగ వేడుకలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. గిరిజన ప్రజలు సంప్రదాయ దుస్తువులతో నృత్యం చేస్తూ అందరిని ఆకర్షించారు. నవ ధాన్యాలను బుట్టలో వేసి తొమ్మిది రోజుల పాటు పూజలు చేసి దానిని తలలో పెట్టుకోని ఊరేగింపు చేస్తారు. ఈ పండుగ లో బీర్ల అయిలయ్య పాల్గొని వారితో కలిసి డాన్స్ చేశారు.



## సింగన్నగూడెంలో డబుల్ బెడ్రూం ఇండ్ల మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేస్తాం

**- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- భువనగిరి పట్టణం సింగన్నగూడెంలో డబుల్ బెడ్రూం ఇండ్ల మౌలిక సందుపాయల పనులను, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డును అధికారులతో పరిశీలించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి లు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ. డబుల్ బెడ్రూం ఇండ్ల మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయని ఆయన అన్నారు. రెండు నెలల్లో రెండు పడక గదులను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను త్వరలో ప్రారంభించడం జరుగుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, నియోజకవర్గ అభివృద్ధి మంత్రులు సహకారం కూడా అందుతుందన్నారు. గురుకుల హాస్టల్ పై చిత్తశుద్ధి ఉంటే అప్పుడు ఎందుకు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గురుకులాల కు మంచిరోజులువచ్చాయన్నారు. అలంపూర్ లో కొందరు పాదయాత్ర చేస్తున్నారు అని ఒకటి రెండు వాటిని చుపించి రాష్ట్రం మొత్తం ఒకే లా అనడం సరికాదన్నారు. బీసీ డిగ్రీ కళాశాల త్వరలో భువనగిరికి రానుందని తెలిపారు. భువనగిరి లో స%శీ%క్షేమ హాస్టల్ ను నూతనంగా నిర్మించి ఇవ్వడానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలకు 2 కోట్ల రూపాయలు ఖర్చు చేసి పూర్తి చేయడం జరిగిందన్నారు. సాగు నీళ్ళు ఇవ్వడం జరిగింది.. బీసీ రిజర్వేషన్ 42% కు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బోనగిరి గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు కొరకు స్థల సేకరణ చేయాలి

**:-భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- పలు గ్రామాలలో రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు కొరకు స్థల సేకరణ చేసి ఫైనల్ వెరిఫికేషన్ చేపట్టాలని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం రోజు జిల్లా కలెక్టరేట్ లోని మినీ మీటింగ్ హాలులో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా భువనగిరి శాసనసభ్యులు మాట్లాడుతూ...భువనగిరి నియోజకవర్గంలో పలు గ్రామాల్లో రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు కోసం స్థల సేకరణ చేసి పేద విద్యార్థులు మంచిగా చదువుకున్నందుకు త్వరత గతిన పనులు పూర్తి చేసుకుని ఏర్పాటు చేసుకునేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పోచంపల్లి, వలిగొండ, భువనగిరి కేంద్రాల్లో రెసిడెన్షియల్ స్కూల్స్, భువనగిరి లో డిగ్రీ కళాశాలలు, సబ్ స్టేషన్ లు ఏర్పాటు కోసం అధికారులు యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. సమావేశంలో సంబంధిత మండలాలు తాసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



## పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి

తొర్రూరు, జులై 31 వాయిస్ టుడే : ఆగస్టు 10న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే శ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి ఉత్సవాలు జయప్రదం చేయాలని గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచరికాన్ని ఎదిరించి స్వేచ్ఛ కోసం గోల్కొండ ను ఆక్రమించి ఉద్యమించిన మహానీయుడు ప్రజలకు స్వేచ్ఛ కోసం బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన వ్యక్తి పాపన్న గౌడ్ అని అన్నారు. జై గౌడ ఉద్యమ జాతి అధ్యక్షులు వట్టికూటి రామారావు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి గౌడ మిత్రులు, గౌడ సంఘ నాయకులు, ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోపా డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్ గౌడ్, గోపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిమ్మల వెంకన్న గౌడ్, చీకర్ శ్రీనివాస్ గౌడ్, జీఎస్పీఎస్ అధ్యక్షుడు దీకొండ శ్రీనివాస్ గౌడ్ శ్రీ కంఠమహేశ్వర గౌడ సంఘం గౌరవ అధ్యక్షులు గోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు రావుల యాదగిరి గౌడ్, ఉప్పలయ్య గౌడ్, రావుల సదానందం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరు భక్తిభావన పెంపొందించుకోవాలి

**టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి**

తొర్రూరు, జులై 31 వాయిస్ టుడే : ప్రతి ఒక్కరూ భక్తి భావనను పెంపొందించుకోవాలని టిపిసిసి ఉపాధ్యక్షురాలు కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలో కంటాయపాలెం రోడ్డులోని పాటిమీద ఆలయ పున:నిర్మాణ దాతలు పత్తి చిలకమ్మ సమ్మయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాలయ ఆలయం పునః ప్రతిష్టాపన మహోత్సవాన్ని ప్రారంభించారు. భక్తిశ్రద్ధలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ తొర్రూరులో ఇలాంటి పవిత్రమైన శివాలయం పునః ప్రతిష్టాపన కార్యక్రమం జరగడం ఆనందదాయకమని, భక్తుల కోరికలు నెరవేరే పవిత్ర క్షేత్రంగా ఈ ఆలయం రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. భగవంతుని ఆశీస్సులతో ప్రజలందరికీ శాంతి, ఐశ్వర్యం, అభివృద్ధి కలగాలని ప్రార్థించారు. అధ్యాత్మికతతో కూడిన ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలలో ధైర్యం, విశ్వాసం పెరుగుతుందన్నారు. దేవాలయం పునః ప్రతిష్ఠాపనకు కృషి చేసిన ప్రతి ఒక్కరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ భద్రకాళి దేవస్థానం ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ భద్రకాళి శేషు, స్థానిక అర్చకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదలకు న్యాయం

తొర్రూరు, జులై 31 వాయిస్ టుడే : కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదలకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందని హచ్చు తండా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బానోత్ వీరన్న నాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరైన లబ్ధిదారులతో కలిసి ఇల్లు నిర్మాణ పనులకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు, నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిల ఆదేశాలు మేరకు లబ్ధిదారులు బానోత్ నాగమణి నరేందర్ ఇల్లు నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో ఇళ్లు పూర్తి చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సాయం పొందాలని కోరారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం పేదలకు ఇండ్లు ఇవ్వకుండా మోసగించిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పేదలను ఆదుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తండవాసులు పాల్గొన్నారు.

# నిబద్ధత, చిత్తశుద్ధితో బిసి సంక్షేమం జిల్లాలో యాదయ్య విధులు నిర్వహించడం సంతోషకరం



## - యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- నిబద్ధత, చిత్తశుద్ధితో బిసి సంక్షేమం, ఇన్చార్జ్ మైనారిటీ సంక్షేమ అధికారిగా జిల్లాలో యాదయ్య విధులు నిర్వహించారని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు.

గురువారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ అధికారి యాదయ్య పదవి విరమణ అభినందన సన్మాన సభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... విధులలో ఎక్కడ కూడా అలసత్వం వహించకుండా ప్రతి సంక్షేమ పథకం అమలు పరచడంలో ఎంతో కృషి చేశారన్నారు. జిల్లాలో 2 శాఖలకు ,(బీసీ సంక్షేమం, ఇన్చార్జ్ మైనార్టీ) అధికారులుగా పనిచేయడం అంటే గొప్ప విషయమన్నారు. జిల్లా కలెక్టర్ గా ఏమైనా ఆదేశాలు జారీ చేస్తే తూచా తప్పకుండా పాటించి అమలులో ముందుంటారన్నారు. ఎన్ని పనులు చెప్పినా ఆలస్యం లేకుండా జిల్లాలో అన్ని సందర్భాల్లో అందరికంటే ముందు ఉంటారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో బాగంగా ప్రభుత్వ పాఠశాలలో, సంక్షేమ హాస్టల్స్ లో మెనూ ప్రకారం విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందించే విషయంలో ఎప్పటికప్పుడు హాస్టల్ వార్డెన్ లతో సంభాషించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ హాస్టల్లో నిద్ర లో భాగంగా పిల్లలతో కలిసిమెలిసి ఉంటూ ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని తెలుసుకొని వాటి పరిష్కారం కోసం చర్యలు చేపట్టారన్నారు. హాస్టల్స్ లలో మంచిగా పనిచేశారు కాబట్టే విద్యార్థులకు ఏ ఇబ్బంది లేకుండా చూసుకున్నారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు గొప్పగా జరిగేందుకు బీసీ కుల సంఘం నాయకులతో కలిసి సున్నితంగా పనిచేశారన్నారు. ఇలాంటి ఒక అద్భుతమైన అధికారి విరమణ పొందడంతో జిల్లాలో ఒక లోటుగా ఉంటుందన్నారు. ముందు ముందుగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పదవి విరమణ పొందిన వారికి ప్రభుత్వం అనుకూలంగా స్పందిస్తే జిల్లాలో వారి సేవలు ఉపయోగించుకుంటామని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో ముందు ముందు సమాజంలో అన్ని విధాలుగా ముందుండాలన్నారు.

రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ... సంక్షేమ శాఖలో పనిచేయడం వారి సేవలను కుల సంఘాలకు, బీసీ, మైనారిటీ సంక్షేమ అభివృద్ధికి వారి సేవలు ఎన్నో ఉన్నాయన్నారు. వివిధ సంఘాలకు ఎంతో సహకరించారన్నారు. ఏ పని చేసినా సౌమ్యంగా ఉంటూ పని పూర్తయ్యే వరకు నిరంతరం పనిలో నిమగ్నమవుతారన్నారు. ముందు ముందు జీవితంలో మంచిగా ఉండాలని కోరారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో కీలక బాధ్యత వహించి విద్యార్థులపై శ్రద్ధ వహించి విద్యార్థులకు ఏ ఇబ్బంది లేకుండా విధులు నిర్వహించారని కొనియాడారు. విద్యార్థులు మంచిగా ఉన్నారంటే అధికారుల కృషి ఎంతో ఉందన్నారు. పదవి విరమణ తరువాత ఇంటి బాధ్యతలు పై ముందుకు సాగాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లాలోని కుల సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు శాలువా , పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టి.జి. ఓ స్టేట్ ట్రెజర్ మందడి ఉపేందర్ రెడ్డి, జడ్పీ సీఈవో శోభారాణి, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏవో జగన్మోహన్ ప్రసాద్, టి. జి ఓ యూనియన్ సభ్యులు, టి ఎన్. జి. ఓ యూనియన్ సభ్యులు, జిల్లాలోని కుల సంఘ నాయకులు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.